నారుగదాండి? దేవతులనే యిలా చేసేవాళ్లకు మనుష్యులంటే లక్ష్యమేలేదు. బ్రాహ్మణుల మాన్యాలకు పన్నులు కట్టినారు. కలౌపంచ సహస్రాణి జాయంతే వర్ణసంకరాః అన్నమాట నిజం అయినది. అందతికంటే బ్రాహ్మలయెక్కువేమంటారు; గుళ్లో దేవుళ్లను రాళ్లంటారు; దయ్యాలు లేవంటారు; పురాణాలలో చెప్పిన కల్లుసముద్రాలూ నేతిసముద్రాలూ అబద్ధమంటారు; సూర్యుడూ చంద్రుడూ అచేతనములంటారు; వారికి పెళ్ళాలూబిడ్డలూ వుండరంటారు; నదులలో స్నానం చేస్తే పాపాలుపోవంటారు; వకటేమిటి? యింగ్లీషు చదువుకొన్నవాళ్ళకు సర్వంనాస్తి. అటువంటి నాస్తికులను పట్టుకొని శిక్షించేవారులేరు. పూర్వంవలె రాతిగానుగలలో పెట్టి ఆడించేరాజులువుంటే వీళ్ళుయిట్లా అంటారండీ?

నృసిం—పురాణాలలో చెప్పిన సంగతులన్నీ నిజమేనండీ?

వెంక—నిజంగాక యీమంత్రాలూ తంత్రాలూ అబద్ధమనుకొన్నారాయేమిటి? అన్నీ నిజం. ఇంగ్లీషువారు వూరికే ధనంపాడు చేస్తూవున్నారుగాని యీకాలవలు తవ్వించడం మానివేసి బ్రాహ్మలకు డబ్బిచ్చి వరుణమంత్రాలు చదివించి సహస్రఘటాభిషేకాలు చేయించమనండి. వర్షాలు యెలాకురిసి పంటలు పండుతవో చూతాము. ఈసేనలనన్నిటినీ తీసివేసి బ్రాహ్మలచేత మహామంత్రాలు జంపం చేయిస్తే శత్రువులంతా వక్కదెబ్బలో నశించిపోరండీ? భూకంపాలు మొదలయినవివస్తే తక్కినపనులన్నీ మానివేసి గ్రహశాంతులు చెయ్యవలెను.

నృసిం—గవర్నమెంటువారు వట్టిపిచ్చివాళ్ళుగాని మీవంటి పెద్దల ఆలోచన పుచ్చుకోవలసినది.

వెంక—నాఆలోచన పుచ్చుకుంటేనా, యింతమంది దేవుళ్ళు వుండరనే యీనాస్తికులందరినీ వక్కసారి జయిలులో పడవేయిస్తును.

యిప్పటివాళ్ళకు గురుశుశ్రూష బొత్తిగాలేదు. నేను మాగురువుగారి వద్ద చదువుకొనేటప్పుడు దొడ్డిఆవ్వి సంవత్సరానికి కావలసినకూరలు పండించేవాడిని; యిద్దరు కూలివాళ్ళు మొయ్యలేని మూటలను పొలంలోనుంచి పట్టుకొనివచ్చి యింటికాడ వప్పగించేవాణ్ని; మఱ్ఱి ఆకులు కోసితెచ్చి విస్తళ్లుకుట్టేవాణ్ని; యింట్లో పనులన్నీ నేనేచేసే వాణ్ని; ఆయన అనుగ్రహంవచ్చి తీఱుబడిగావున్నప్పుడు రెండు ముక్కలు చెప్పేవాడు; వొకొక్కనాడు అదీలేదు. అలా కష్టపడి యిరవయియేళ్ళు వ్యాకరణం చదువుకొన్నాను. ఆలాకష్టపడడంచేత మావిద్యలు ఫలిస్తవిగాని యిప్పటివాళ్ళచదువులు ఫలిస్తవండీ? యింగ్లీషుచదువుకొన్నవాళ్ళు వట్టిమురాచారులు; నదిలో బురదనీళ్ళని నూతినీళ్ళల్లో మునుగుతారు; స్నానముచెయ్యడం వంటిశుభ్రంకోస మట! వట్టి దుర్నీతులు; గుడ్డివాళ్ళకూ కుంటివాళ్ళకూ దానంచేస్తే పుణ్యంవస్తుందట! ప్రాచీనసదాచారములను దూషిస్తారు; యీబోగం వాళ్ళను వుంచుకోవడం యెంతకాలంనుంచి వస్తూవున్న సదాచారము? మీరుకూడా యిందులో ప్రవేశించడం బాగావున్నదికాదు. వీర భద్రుఁడు మొదలయినవారు వట్టిదుర్వాదములో దిగుతారు; తదను గుణంగా శ్రుతులకర్థాలు చేస్తారు; స్మృతులకు తమ యిష్టానుసార ముగా అర్థంచేస్తారు; శ్రుతిస్మృతులలో వ్యభిచారంకూడదంటే దానికిబో గంవాళ్ళనుకూడా వుంచుకోరాదని అర్థమట! అట్టివారు కలిపురుషులు. యీనవనాగరికులమాటలునమ్మి మోసపోయి యీసదాచారములను మీరు మాన్ప వూనుకుంటే నిందలపాలయిపోతారు. ఇలా చెడపోతా రంటే వాళ్ళు మావంటిసాధువులను నిందిస్తారు. మీరిందులో ప్రవే శించవద్దు; మీశ్రేయస్సుకోరి చెప్పినాను. బాగా ఆలోచించుకోండి. నావ్యాజ్యంలో వకాల్తునామామాట యేమిచేసినారు?

నృసిం—నేను మీవ్యాజ్యంలో వకాల్తునామా పుచ్చుకోను. మరివక ప్లీడరుకియ్యండి. నేను అబద్ధపువాదంచెయ్యను.

వెంక—యీమాట మొదటనేచెపితే యిదివఱకే వెళ్ళిపోదునే. బ్రాహ్మణకార్యం ఫీజులేకుండా చేస్తారేమోనని ఆశపడి వచ్చినాను. (అని కోపముతో వెళ్ళిపోవుచున్నాఁడు.)

తృతీయాంకము.

౧. ప్రదేశము—నృసింహారావుపంతులుగారి సావిడి.

[నృసింహారావుపంతులుగారును, సుబ్బారావుపంతులుగారును ప్రవేశించుచున్నారు.]

నృసిం—సుబ్బారావుగారూ! ఒకచిత్రముజరిగింది విన్నారా?

సుబ్బా—ఏమిచిత్రము?

నృసిం—నెలదినములనుంచి మనబాపిరాజుగారు నెలకు యిరవై రూపాయలు జీతంచేసి భోగందాన్ని వుంచినారట!

సుబ్బా—ఆఁ! ఇది మహాఆశ్చర్యంగావున్నదే! నిజంగానే ఆయన భోగందాన్ని వుంచుకొన్నారా? ఊరికే మీరు వేళాకోళానికన్నారా?

నృసిం—వేళాకోళానికికాదు నిజమేచెప్పుతూవున్నాను. నేనున్ను నిన్నరాత్రి విని మొట్టమొదట నమ్మలేదు. తరువాత వాకపుచేస్తే నిజమని రూఢిగా తెలిసింది.

సుబ్బా—ఆయన యెప్పుడూ పరస్త్రీలవంక మొగంయెత్తివినా చూచేవాడుకాడే.

నృసిం—అవును. ఆయన ఆలాంటివాఁడే. మొట్టమొదట నేను పనికి సిఫారసుచెయ్యడానికి సబుజడ్జీగారియింటికి తీసుకునివెళతానంటే, అక్కడ యెప్పుడూబోగంవాళ్ళు వుంటారని వకపట్టాన వచ్చినాఁడు కాఁడు. తరువాత మెడలువిరిచి వకరోజు బలవంతంగా తీసుకు వెళ్ళినాను.

సుబ్బా—అప్పుడేమిజరిగింది?

నృసిం—సావిట్లో బోగంవాళ్ళుకూర్చున్న పక్కకు దూరంగా వకమూలను కూర్చున్నాడు. వాళ్ళు పాడుతూవున్నంతసేపూ వాళ్ళ ముగంవంకనైనాచూడక తలవంచుకొని కూరుచున్నాఁడు.

సుబ్బా—తరువాత రోజూ ఆయన దర్శనానికి వెళుతూ వచ్చేవారా?

నృసిం—వీధిలోనిలుచుని కనుక్కుని బోగంవాళ్ళు లోపలలేరని కబురుతెలిసినతరువాత మరీ లోపనికివెళ్ళేవారు. ఆయన వెళ్ళిన తరువాత బోగంవాళ్లువస్తే మధ్యలేచిపోతే బాగుండదని విధిలేక ముళ్ళల్లో కూర్చున్నట్టు కూర్చుండేవారు.

సుబ్బా—అటువంటివాడు ముండను యేలాగువుంచుకున్నాడండీ? ఇది మహాఆశ్చర్యంగావున్నది.

నృసిం—చెపుతానువినండి. యువతలకు వచ్చిన తరువాత అక్కడ బోగంవాళ్లు వుంటారని వెళ్ళడానికి సిగ్గవుతూవున్నదని నాతో వూరికే చెపుతూవుండేవాడు. ఇలా కొన్నాళ్లు జరిగినతరువాత పాట వింటే యేమని తలయెత్తకనే మెల్లిగా చెవియొగ్గి పాటవిన మొదలుపెట్టినాఁడు. తరువాత కొంచెం దగ్గరగాకూర్చుంటేనేకాని పాటతిన్నగా వినపడదని కొంచెంకొంచెం యువతలకు జరగడం ఆరంభించినాడు.

సుబ్బా—పాటమాత్రము వింటూవుంటే యిబ్బందిలేదు. మనముమాత్రం తాంబూలానికి వెళ్ళినప్పుడు వినడంలేదా?

నృసిం—అలా కొన్నాళ్ళు జరిగినతరువాత మొగంవంకచూస్తే యేమని యెవరూచూడనప్పుడు నేత్రాభినయం చూడడానికి వాళ్ళ మొగంవంకచూస్తూ యెవరయినా చూచినప్పుడు చూపుమళ్ళించుకుంటూ వుండేవాఁడు. ఈప్రకారం కొన్నాళ్ళు జరిగినతరువాత మఱి వకరు చూస్తూవున్నాకానీ అందరూ చూడడంలేదా అని పాడేదాని అభినయం భాగాచూడ మొదలుపెట్టినాఁడు. క్రమక్రమముగా సంగీత మందలి అభిరుచి అధికమై సబుజడ్జీగారియింటికి తరుచుగా వెళ్ళడం సాగించినాఁడు.

సుబ్బా—చూచినారా తఱుచుగా చూస్తూవుండడంచేత యెలాంటిమార్పు కలిగిందో!

నృసిం—అదియేమిమార్పు? చూడఁగా చూడఁగా అభినయ మందు దృష్టిలేక దానిమొగం చూడవలెననే చూడ మొదలుపెట్టి నాఁడు. కాని ప్రథమమందు అలాచూడడం అన్యాయమనితోచి బుద్ధి మళ్ళించుకుంటూ వుండేవాడుగాని రాగారాగా మాఱిపోయి వూరికే మొగంచూస్తే యేమిదోషం అని అందంచూచి ఆశ్చర్యపోవడముకు ఆరంభించినాఁడు.

సుబ్బా—అంతవరకు వచ్చినప్పుడు చెడిపోవడముకు సందేహం లేదు.

నృసిం—అలంకరించుకొని వచ్చి దీపము వెలుతురున పాడుతూ వుంటే దానిమొగం అంతకంతకు మరింత అందముగా కనుపడుతూవుండేది. తరువాత దానిపొందు యెంతసుఖముగా వుంటుందో అని బుద్ధి పుట్టిందట. యీసంగతంతా నాతోఅతఁడు వెనుకచెప్పి తనబుద్ధి మళ్ళిం

చుకున్నాననిన్నీ వాళ్లయింటికి మాత్రము యెప్పుడూ వెళ్ళననిన్నీ చేతిలో చెయ్యివేసినాఁడు. ఇంతలో అతనికి సబుజడ్జీగారు కోర్టులో ప్లీడరు పని చేయించినారు.

సుబ్బా—పని అయినతరువాత యేమయినది.

నృసిం—పని అయినతరువాత సబుజడ్జీగారి అనుగ్రహంచేత డబ్బుకూడా దొరకడం ఆరంభించినది. బోగం దానితో సంభోగం దోషమనితోచినా, మాటాడడంలో యేమీ దోషంలేదని ఆపాడేదానితో సరసాలాడడం ఆరంభించినాఁడు. ఇలాగు సరసాలెక్కువకావడంతోటే తక్కినవారు తెలుసుకుని కారువా పట్టించినప్పుడు దానిచేత ఆయనకు గంధంపూయించడం ఆరంభించినారు. ఆస్పర్శసుఖంవల్ల స్వర్గం దొరికినట్టు సంతోషించి వక్కమాటు యెలాగైనా దానిపొందు పడయవలెనని రాత్రి దానియింటికి సగందూరంవెళ్ళి పాపమనితోచి మళ్ళీవచ్చినాడని ఆయన స్నేహితుఁడే నాతో చెప్పినాఁడు.

సుబ్బా—తరువాత యేమయింది?

నృసిం—ఇట్లు కొంతకాల మాబోగముదాని మొగముచూచి నప్పుడెల్లా ఆశపీడింపగా, పాపమని మనసుబోధించి నివారింపగా, తుదకు కామబాధకులోబడి పాపభీతివిడిచి చొరవచేసి వకసారి దాని యింటికి వెళ్ళినాడట. అటుతరువాత అతణ్ని మనస్సు బహువిధాల చీవాట్లుపెట్టి బాధింపఁగా పదిదినములేమీ తోచకుండావుండి దాని ముఖం తలుచుగా చూస్తూవుండడంచేతనూ దాని మాయమాటలు పలుమాఱు వింటూవుండడంచేతనూ దానివలలోఁబడి నెలదినముల నుంచి దాన్ని బహిరంగంగానే వుంచుకొన్నాడట.

సుబ్బా—బాపిరాజుగారిని ఆయన బంధువులుయెవరూ కూకలు వేసినారుకారా?

నృసిం—మొట్టమొదట కొన్నాళ్ళు బంధువులకు మొగం కనపర్చకుండా తప్పించుకునితిరుగుతూ వుండేవాఁడు. తఱువాత కనపడి వారుచెప్పిన బుద్ధివిని మాటాడక వూరుకుండేవాడట! ఇప్పుడిప్పుడు భోగందాన్ని వుంచుకుంటే యేమిదోషం, నేను మానననని తెగించి స్పష్టంగా చెపుతూవున్నాడట.

సుబ్బా—వాళ్ళవలలో పడ్డతరువాత మళ్ళడంకష్టం. ఇక చెడిపోతాడు.

నృసిం—ఇక చెడిపోవడంయేమిటి? యిదివఱకే చెడిపోయినాడు. డబ్బంతా దానికిదోచిపెడుతూ వున్నాఁడు. ఈ నెల్లాళ్ళలోను రెండువందల రూపాయలు పాడుచేసినాఁడు. పెళ్ళాము మెడలోవున్న పట్టెడ కొట్టితీసుకొనిపోయి తాకట్టు పెట్టినాఁడు. తండ్రిగారు సంపాదించిన వెండిచెంబులజోడు నిన్న వుదయాన్ని అమ్మివేసినాఁడు.

సుబ్బా—ఆరంభంగనుక వళ్ళూపయీ తెలియకుండా డబ్బు పాఱవేస్తూ వున్నాఁడు. దానితల్లి మహాచెడ్డముండ.

నృసిం–చెడ్డముండయేమిటి? ఇదివరకు యెందరు లక్షాధికారులను బిక్షాధికారులనుచేసి ముష్టిచెంబు చేతికిచ్చి గుమ్మంవద్దకు రాకుండా తరిమివేసింది? బాపిరాజుగారు బుద్ధిమంతులూ చదువుకున్నవారూ అని సంతోషిస్తూవుంటే తుదకీ ప్రకారందిగింది.

సుబ్బా—ఇఁక ముందేమవుతుందో! యింతటితోనైనా బుద్ధి తెచ్చుకుని మళ్ళుకోవడం వుత్తమం.

నృసిం—ఇక మళ్ళడం అబద్ధం. ఇదివఱకీవృత్తిలో ప్రవేశించిన వారినందఱినీ చూడడంలేదాయేమిటి? వీరియెక్కువవేమిటి? రెండు రోజులు పోయినతఱువాత యిల్లూ వాకిలీకూడా అమ్ముకొని సమస్త పాడుపనులకూ లోబడి యిల్లూ వళ్ళూ గుల్లచేసుకుంటూ యెప్పుడో

ఒకప్పుడు రోగాలచేత దేహంవిడుస్తాడు. తరువాత పెళ్ళాము తిండికి టికాణాలేకుండా ఫలానివాడి పెళ్ళామునని ముష్టియెత్తుకొని బ్రతుకుతుంది.

సుబ్బా—పోనియ్యండి ఒకసారి బాపిరాజుగారిని మనయింటికి పిలిపించి మొగము వాచేటట్టుగా రహస్యంగా చివాట్లుపెట్టి మళ్ళించడానికి ప్రయత్నంచేతాము. వినకపోతే అతనిఖర్మము మనమేమి చేస్తాము? నాకు పనివున్నది వెళ్ళివస్తాను. (అని వెళ్ళుచున్నాడు.)

---

౨. ప్రదేశము—పట్టణమందిరము.

[పెన్షన్డ్ మునసఫగు భీమారావుపంతులుగారును, నృసింహారావుపంతులుగారును రామసోమయాజులుగారును మఱికొందఱును ప్రవేశించుచున్నారు.]

భీమా—ఏమండీ! ఈరోజున మూడుఘంటలకే సభ అని వర్తమానం పంపినా యింకా అందరూవచ్చినారుకారేమండీ? ఇంతేనా యింకాయెవరైనా వచ్చేవారున్నారా?

నృసిం—తమరు సభచేయిస్తామంటే రానివారెవరైనావుంటారా? అందరూవస్తారు. మీసభచెయ్యడం వుద్దేశమేమో నాకు తెలియదు.

భీమా—మీరీమధ్య భోగంవాళ్ళ విషయంలోకాదా వూళ్ళో చాలాగడబిడచేస్తూ వచ్చినారు; ఆవిషయంలో నేను మీఅందరికంటె యెక్కువ అనుభవం గలవాడిని గనుక నాకుతోచిన సంగతి చెప్పడానికి మిమ్మలినందఱినీ పిలిపించినాను.

నృసి—తమరుమా ప్రయత్నానికి అనుకూలంగా చెప్పుతారా? ప్రతికూలంగా చెపుతారా?

రామ—తప్పకుండా వారు మాపక్షంగానే వాదిస్తారు. వారు మీకు ప్రతికూలంగా గాకపోతే అనుకూలంగా చెపుతారా? లోకానుభవం గలవారందరూ మాపక్షంగానే మాటాడుతారు.

భీమా—నేను యేపక్షంగా మాట్లాడేదీ అందరూవచ్చిన తరువాత గాని చెప్పను. ఈలోగా మరివకసంగతి యేదైనా మాటాడుకొందాము.

రామ—మీరు పింఛన్‌పుచ్చుకొని అప్పుడే రెండేళ్ళు కావచ్చినది కాబోలును. మీరు మునసఫీ మహాబాగాచేశారు.

భీమా—ఈజనవరితో రెండేళ్ళమీద మూడుమాసములయినది. పనిలోవున్నప్పుడేమీ తెలిసిందిగాదు. మునసఫీచేసేకాలంలో నేను నెలకు పదివేలు సంపాదించేవాణ్ని. పనిమానుకునేవరకు పూర్వం సంపాదించినది వక్క గుడ్డిగవ్వలేదు. ఇప్పుడింకా నాకు రెండువేల రూపాయల రుణాలున్నవి.

రామ—ఎంతసంపాదించినా కానీ మీరెవరినీ రొష్టుపెట్టి పుచ్చుకునేవారుకారు.

భీమా—నిర్బంధపరిస్తేనేకాని యెప్పుడూ డబ్బుయివ్వరు. ప్లీడర్లందరితోనూ స్నేహంగావుండి వాళ్ళుయేమి అల్లరిచేసినా మాటాడేవాణ్నికాను. అందుచేత వక్కమోస్తరుగా అంతకాలం సాగివచ్చినది.

రామ—శివిల్‌కోర్టుకు యెదుట మీకచేరివుంటూవున్నా యేమీ లక్ష్యంలేకుండా అంతకాలము సాగిరావడంచూస్తే మీరు బహు జాగ్రతగా పనిచేసినట్టు కనుపడుతుంది.

భీమా—జాగ్రతయేమిటి? నేను సాధ్యమయినంతవరకు న్యాయమయినపక్షముననే డబ్బు పుచ్చుకుని జడ్జిమెంటు హైకోర్టుకువెళ్ళినా తిరిగిపోకుండా వుండేటట్టువ్రాసేవాణ్ని. చిల్లరగా పుచ్చుకున్నంత లాభము మరి యెందులోనూలేదు. ఇచ్చేవాడికీ కష్టంగావుండదు. పుచ్చుకునేవాడికీ కావలసినంత డబ్బువస్తుంది. నేను పిటీషను వకట్కింటికి రూపాయీ అర్ధా పావలా చొప్పున పుచ్చుకొన్నా ఫక్తుపిటీషన్‌లలో రోజుకు ముప్ఫయిరూపాయలకు తక్కువలేకుండా కళ్ళచూసేవాణ్ని. నేను లంచంపుచ్చుకుంటానని హైకోర్టు జడ్జీలకు తెలుసును; శివిల్‌జడ్జీకి తెలుసును. అయినా నేను యెప్పుడూ దొరికేవాణ్నికాను. నాలుగూ మూడూ లంచంయిచ్చేవాళ్ళు ఫిర్యాదుచేసుకోరు. ఫిర్యాదుచేసుకున్నా రుజువుపర్చడం మహాకష్టం. ఎదురు ఫిర్యాదుచేసినవాడికే శిక్ష అవుతుంది.

నృసి—అదిగో మనవారంతా వస్తూవున్నారు.

[పది పండ్రెండుగురు పెద్దమనుష్యులు ప్రవేశించుచున్నారు]

రామ—అందరున్నూ వచ్చినారు. వేగిరం యీ మీటింగు విషయం చెప్పివెయ్యండి. మళ్ళీ చీకటిపడుతుంది.

భీమా—(లేచి నిలుచుండి) నాయందు దయచేసి పెద్దమనుష్యులంతా దయచేసి వున్నారు. మీరుచేసే సభవిషయమై రెండుమాటలు మనవిచేసుకుంటాను. ఈ విషయంలో నాకువున్న అనుభవం మీలో యెవరికీలేదు. నేను మునసబీచేసే కాలంలో వకొక్క నెలలో యిరవై వేలరూపాయిలు సంపాదించానన్నా నమ్మవలెను. అంతడబ్బు సంపాదించినా యింకా సంపాదించవలెననే వుండేది. నాడబ్బంతా ముండలకింద ఖర్చుపెట్టేవాణ్ని. అప్పుడు యెవరుచెప్పినా వినక భోగందాన్నిచూస్తే నాకు స్వర్గందొరికినట్టు వుండేది.

అప్పుడూ వాళ్ళమాయలోబడి లోకం తెలిసేదేకాదు. దానికి ఫలం డబ్బంతాపోయి రుణాలపాలయి వుండడమే కాకుండా రోగాల చేత వళ్ళంతా పాడుచేసుకొని యిప్పటికీ బాధపడుతూ వున్నాను. ఈ బాధచూస్తే వొక్కొక్కప్పుడు దేహంవిడిస్తే బాగావుంటుందని తోస్తుంది. నిర్దోషులయిన నాకొడుకులు నాదోషంచేత వచ్చిన జాడ్యలచేత ముగ్గురు వరుసగా పోయినారు. నాభార్య బ్రతికివున్నంతకాలమూ జాడ్యాలచేత బాధపడుతూనేవుండేవి. ఇప్పుడు నేను యీలోకంవదిలి పెట్టడానికి సిద్ధంగా వున్నాను. వెళ్ళేటప్పుడు పాపం వొకటితప్ప వెంట వచ్చేది మరియేదీ కనపడడంలేదు. కాస్త దేహంలో జబ్బువచ్చినప్పుడల్లా మరణం జ్ఞాపకంవచ్చి నేను పడేబాధ యింతంతని చెప్పశక్యము కాదు. కాబట్టిమీరు నాబుద్ధివిని భోగంవాళ్ళ సహవాసం మానివేస్తారని మిక్కిలి కోరుతున్నాను. అందువల్ల మీకు ఇహపరములు రెండూ కలవు.

నృసి—వారుబహుబాగా చెప్పినారు. వారుపెద్దలుగనుక అందరూ ఆప్రకారం నడుచుకుంటే సర్వోత్తమముగా వుంటుంది.

రామ—మేము చేసేపని అక్రమమయినదని మాకూ తెలుసును. అయితే పడుచుతనంలో వుండడంచేతనూ అలవాటుపడడంచేతనూ వకపట్టాన మానలేకుండా వున్నాము. మీరు మీ అనుభవంచేత సమస్త కష్టములనూ తెలుసుకొని మాకు హితం చెప్పుతూ వున్నారు గనుక సాధ్యమయినంత శీఘ్రంగా మావృత్తినుంచి మళ్ళుకుంటాము.

భీమా—మీకీబుద్ధి స్థిరంగా వుండేటట్టు చేయవలెనని నా యిష్టదైవమును నిత్యమూ ప్రార్థిస్తూవుంటాను.

[అని సభ చాలించుచున్నారు.]

మోడరన్ప్రెస్, కలర్ప్రింటర్స్ & బాక్సుమేకర్స్, రాజమండ్రి.

వినోదతరంగిణి

ఇది

కందుకూరి వీరేశలింగముచేత

రచియింపఁబడినది.

మూడవకూర్పు.

రాజమండ్రి:

మోడరన్ ప్రెస్‌నందు ముద్రింపఁబడినది.

1949

దీనివెల 4 అణాలు.

వినోదతరంగిణి

ప్రథమాంకము.

౧ ప్రదేశము—సోమయాజులుగారియిల్లు.

[సోమయాజులుగారు ప్రవేశించు చున్నారు]

సోమ—(తనలో) వార్ధకదశలో వివాహము చేసికొన్న వారికి పాట్లెక్కఁడను ఈలాగుననే యుండును. "ఆలుకాదది వ్రాల" న్న సామెత నాకిప్పుడనుభవమునకు వచ్చినది. అయ్యో! అంతమంది వద్దనుచుండగాఁ వినక బుద్ధిగడ్డితిని వివాహమాడిన పాపఫల మనుభవింపక తీఱునా? పెద్దభార్య పోయినతరువాత నాలుగేండ్లదాఁక ఎవ్వరునుపిల్ల నియ్యనందున పాలలోఁబడ్డ బల్లిలాగున పరితపించి, తుదకుయజ్ఞము నిమిత్తము యాచించి ఆర్జించిన సొమ్ములోనుండి మిగుల్చుకొన్న ఆఱు వందల రూపాయలును పిల్లదాని తండ్రి మొగమున తగులఁబెట్టి ముందెంతో సుఖపడవలెనని కొండంత ఆశతో ఆఱుసంవత్సరముల పిల్లను కట్టుకొన్నాను. క్రొత్తగా గృహప్రవేశమునకు తీసికొని వచ్చినప్పుడు నన్నును ఆచిన్నదానిని చూచి, యెఱుఁగనివారందఱును నాకదిమనుమరాలనుకొనిరేకాని యెవ్వరును భార్యయని తెలిసికోఁజాలకపోయిరి. పెండ్లి అయినది మొదలుకొని పిల్లదియెదిగి యెప్పుడు కాపురమునకు వచ్చునా, ఆమహాభాగ్యమంతయు నేనెప్పుడు బావుకొందునా, అని నోటిలో వ్రేలుపెట్టుకొని గుటకలు మ్రింగుచు దినమొక కల్పముగా గడుపుచు నేనుతొందరపడిన కొలఁదిని పిల్లదియీడేరుట వెనుకకే పోవుచువచ్చెను. కడపట చిన్నది పెద్దదయి యింతకాలమునకు నాతపము ఫలించెను. గదాయని సంతోషపడెడు దినములు వచ్చునప్పటికి, దైవము నామేలునుచూచి ఓర్వలేక యింటికి నాతోఁ. కాపురముచేయవచ్చెడు

లోపలనే దానిని నాపాలిటియమదూతనుగా మార్చివేసినాఁడు. అప్పటి నుండియు దానికి నాపొడ గనఁబడిన, త్రొచుపామునుచూచినట్లుండును ఉగ్రహాచారమునకుతోడు నాకు చంద్రయ్యయను కపట శిష్యుఁడొకఁడుకూడ దాపురమయినాఁడు; వానిని చూచినప్పుడెల్ల దానికి ప్రాణము లేచివచ్చును; అతఁడింట నున్నంతసేపును కిలకిలలాడుచు నవ్వుచు పేరిలుచు స్వర్గములో నున్నట్లుండును; ఆదుర్మార్గుని మా యింటికి రావద్దన్న ఉన్నగోడుకూడ చెడునేమో యని మూనుషము నకు నిలిచి నేనెఱిఁగియు ఎఱుఁగనట్లు నటించుచున్నాను. నన్ను చూచి నతోడనే దాని కేడుపుమొగముపడి యెక్కడలేని చిరాకునువచ్చి నన్ను చండాలునిఁ జూచినట్లు చూచును; రాత్రి నాతోఁగదిలోనున్న నాలుగు గడియలును మొగము ముడుచుకొని ప్రాణములు బిగఁబట్టు కొని మాటాడక యమలోకములో ఉన్నట్టుండును. వశ్యౌషధము ఇచ్చెదనని యొక వేసుచేతిలోఁ బెట్టి మొన్నటి బైరాగివాఁడు నిష్కా రణముగా నాలుగు రూపాయలు ఎత్తుకొని పోయినాఁడేగాని, మందు గుణము కొంచెమయిన అగపడి అదినాతో మొగమిచ్చి మాటాడుట యయినను లేకపోయెను. అదిగో సోమిదేవి చీపురుగట్టపట్టుకొని చావడి లోనికి వచ్చుచున్నది.

[సోమిదేవి ప్రవేశించుచున్నది]

సోమ—ఓసీ! ఓసీ! ఒకసారి దగ్గఱకువచ్చి చెవిలో మాట చెప్పెదను వినిపో.

సోమి—సరి! సరి! మీనోటి కస్తమానము 'ఓసీ' 'ఓసీ' అన్న మాటకు విసుగులేదు. మీకునాతో ఏమిరహస్యము వచ్చినది? మగఁడు పోయిన ముండవలె మీరు రాత్రింబగళ్ళు పనిపాటలులేక యిల్లుపట్టు కొని వదలరు. మహారాజువలె వీధిలోకిపోయి యేదైన పనిచూచుకో

రాదా? మీరింటచేకపోయిన, ఇంతలో పెండ్లాము నెవ్వరును ఎత్తుకొని పాఱిపోరులెండి.

సోమ—ఏమే? నీకు నాతో మాటాడుటే బంగారముగానున్నది నేనెంతో నీమీఁది ప్రేమచేత దేవతార్చనకని యింటింటఁదిరిగి నిత్యమును మంచిపువ్వులు తెచ్చి యిచ్చినను, ప్రతిదినము ఇంటిముంజూరు పెండెలో పెట్టుటేకాని యొక్క నాడయినను ముచ్చటదీఱ నేనుచూచుచుండఁగా కొప్పులో ముడుచుకోవు. విలువ చీరలిచ్చినను మఱునాటికే చింపివేయుదువుకాని ఒక్కరాత్రియైనను పడకగదిలోనికి కట్టుకొని రావు. నన్ను చూడఁగానే దయ్యముపట్టినదానివలె తలవిరియఁ బోసికొని చింపిరితలతో బూచివలె గనఁబడుదువు.

సోమి—చాలు! చాలు! ఈపాటికి నీచదువు చాలించు. నీకెప్పుడును నన్నాడిపోసికొనుటతోనే సరిపోవును. ఆలి ఒల్లనివానికి ఈలకూరలో ఉప్పుఎక్కువయినదఁట?—దైవమా! ఇంట నాకీ పోరెప్పుడు విఱుగడచేసెదవో—

సోమ—ఓసీ! కోపపడకే. ఎవ్వరో లోపలికి వచ్చుచున్నారు; వాకిటిలో చెప్పుల చప్పుడగుచున్నది. ఉత్తప్పుడు లేకపోయిన మానెఁగాని, ఇతరు లింటికివచ్చినప్పుడయిన, బిగ్గరగా మాటాడక నాయెడల ఇంతభక్తిచూపి పతిపూజసేయుచున్నట్టు పయికయిన నటించుచురావే.

సోమి—(మొగమున నెటికవిఱిచి) భక్తికాదు. నీ మొగమున పెద్దమొద్దులు పెట్టవలెను. ఎవ్వరో వచ్చుచున్నారుగా; లేకపోయిన పక్షమున చేతిలోనున్న యీ చీపురుగట్ట పుచ్చుకొని నాకసిదీఱ పెద్దపూజచేసి వదలిపెట్టుదును. (అని లోపలికి వెళ్ళుచున్నది.)

[అవధానులు ప్రవేశించుచున్నాఁడు.]

అవ—సోమయాజులుగారూ! లోపల మీరేమో పనిమీఁద ఉన్నట్టున్నారు. ఒక్కసారి నడవలోకి వచ్చెదరా?

సోమ—వచ్చుచున్నాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

అవ—సోమయాజులుగారూ! ఈదినము పొద్దున మనవీధిలో జరిగిన విపరీతము చూచినారా?

సోమ—నాయనా! ఏమివిపరీతము? నేనేపాపకర్మము నెఱుఁగను. తెలివిమాలిన మనసోమిదేవియేమైన—

అవ—కాదు కాదు. ఎవ్వరో పిల్లనుగని చంపివేసి రాత్రివేళ మనగుమ్మమున కెదురుగా వీధిలో పాఱవేసినారు.

సోమ—(తొందరపడి) నాయనా! అంతచేటుకాల మెవరికివచ్చినది? ఎవరు—ఎవరు పాఱవేసినారు.

అవ—మీ రెఱుఁగరా? (మెల్లగా) భీమరావుపంతులుగారి మఱఁదలేమో కని పాఱవేసినదని యిరుగు పొరుగుల అమ్మలక్కలు చెప్పుకొనుచున్నారు. వెనుక మీరే కదా ప్రతిదినము పంతులుగారు సభకు వెళ్ళినతరువాత మధ్యాహ్న మక్కడికిపోయి వేదాంతము చెప్పుచు వచ్చితిరి.

సోమ—వెనుక నేనే చెప్పుచువచ్చితినిగాని, ఈనడుమ నావలె వట్టిమాటలచేత నేకాకుండ అనుభవముచేతకూడ నేనుపదేశించిన వేదాంతమును చెప్పఁగల పడుచుశాస్త్రియొకఁడు ప్రవేశించినందున పది నెలలనుండి నాకు ద్యాసమయినది. ముండలు తిండితిని తిన్నగా ఉండలేక కండకావరమున కన్నుగానక యీలాగున కానిపనులు చేయుదురు.

అవ—అదియంతయు మీయుపదేశమునుబట్టియే కాని మఱియొకందుచేతఁగాదు. అయినను అట్టిపనులకు లోఁబడుటలో స్త్రీల లోపమేదియు లేదు. మూడేండ్లముండలు మగఁడుపోయినతరువాత, ఏదో యొకవిధమున కోరికతీర్చుకోక ఉప్పును పులుసును తిను దేహములతో ఎంతకాలము తిన్నగా ఉండఁగలరు? అన్ని సౌఖ్యములను అనుభ

వించి అఱువదియేండ్లుదాటి సమస్తము తెలిసిన మీవంటిపెద్దలు సహితము పెండ్లిచేసికొని సుఖపడఁ గోరుచుండఁగా, నడివయసులో నున్న బాలవిధవలు కామబాధకు లోఁబడుట ఆశ్చర్యమా?

సోమ—ఆముండలసంగతి మనకెందుకుఁగాని, ప్రసంగము తీసికొనివచ్చినావు గనుక నీతో నేనొక రహస్యముచెప్పెదను. నేనెంత ముసలితనములో పెండ్లియాడినను, మన సోమదేవివంటి పతివ్రత మఱియొకతె లేదుసుమీ. అబద్ధమాడరాదు. దానిఅడఁకువయు, పతిభక్తియు, ఏమిచెప్పను? మంచిగుణములన్నవి దానినిచూచి మఱియొకస్త్రీ నేర్చుకొనవలెను.

అవ—అవును. మీరుచెప్పకపోయిన, ఆమె సుగుణములు పొరుగుననున్న వాఁడను నాకు తెలియవా? ఇప్పుడు చంద్రయ్యవచ్చి మీవద్ద వేదమును చదువుకొనుచున్నాఁడా?

సోమ—చదువు మానివేసినాఁడుగాని యిప్పుడు సహితము మాయింటికి దినమునకు నాలుగు పర్యాయములువచ్చి చూచిపోక మానఁడు. వానికి నాయెడల పరమవిశ్వాసము, నేను లేకపోయినను ఎప్పుడును మాయిల్లువదలఁడు; వాఁడందఱ శిష్యులవంటివాఁడుగాఁడు; పరమయోగ్యుఁడు.

అవ—అవునవును. అతఁడు చీకటికైన భయపడక రాత్రిలు గూడ మీయింటివద్దనే తఱుచుగా నుండఁగాఁ జూచుచున్నాను. మొన్నరాత్రి మీరు గడియసేపు తలుపుతగ్గఱ కేకలువేసినప్పుడు లేచి వచ్చి తలుపుతీసినదతఁడే.

సోమ—ఒక మొన్నరాత్రియేకాదు. సోమిదేవియింట ఒక్కతెయు ఉండలేదని నేను లేనప్పుడు రాత్రియు పగలునుకూడ దానికి సహాయముగా మాయింటనేఉండి నేనువచ్చినతోడనే వెళ్ళిపోవుచుం

డును. మనగ్రామములో దొంగలభయము విస్తారముగనుక, ఇంటి భద్రముకొఱకు తలుపులువేసికొని మఱిలోపల కూరుచుందురు. ఇంత జాగ్రత్తగానున్నను, నాలుగుదినములక్రిందట మాపడకగదిలో తాళము పెట్టెలోనున్న నూఱురూపాయల శాలువు పోయినదిసుమీ. ఇట్లు తఱుచుగా వచ్చుచుండునని వానియొద్దనుగాని మాయింటిదాని యొద్దనుగాని ఒక్కదుర్గుణము లేదుసుమీ. నీపాదములసాక్షి నామాట నమ్ము. ఒకరినొకరు కన్నెత్తి చూడనైనఁ జూడరు.

అవ—ఆసంగతి అంతయు నేనెఱుఁగుదును. మీరు వేఱే సెల వియ్యనక్కరలేదు.

సోమ—దానికేమిగాని మొన్నటిసంగతి యేమిచేసినావు?

అవ—మొన్నటిదినము మనమందఱమునుజేరి ఆలోచించి స్త్రీలతో రహస్యము చెప్పఁగూడదని సిద్ధాంతము చేసికొన్ననాఁడే నేనింటికివెళ్ళిన తరువాత, మీయందఱిమాటప్రకారముగా భోజనము నకు లేవక మంచముమీఁద ముసుఁగు పెట్టుకొని పరుండి మనసులో లేని విచారమును పైకి నటించ మొదలుపెట్టితిని.

సోమ—నీభార్య భోజనమునకు లేవవలసినదని తొందరపెట్ట లేదా ?

అవ—నూరుసారులువచ్చి పిలిచి తొందరపెట్టినది. నేను మొగము చిన్నపుచ్చుకొని యెంతసేపటికిని లేవకుండుట చూచి నాకేమో ఆపదవచ్చినదని ఊహించి కారణమును తనతో చెప్పుమని నన్ను వేయివిధముల నిర్బంధపెట్టినది.

సోమ—నీవేమి చెప్పినావు?

అవ—ఎంతసేపటికిని చెప్పక చాలాసేపు తంటాలుపెట్టి, నావిచారకారణమును మఱి యెవ్వరితోను జెప్పనని నామీఁదను

బంధువులమీఁదను దేవునిమీఁదను లక్షప్రమాణములు చేయించి తుదకు నేను కడుపుతోనున్నానని చెవిలోరహస్యముగా చెప్పితిని.

సోమ—అందవిరుద్ధమయిన సంగతి నమ్మినదా?

అవ—మాఱుమాటాడక ఒక్కనిమిషములో నమ్మినది.

(తెరలో)

'నీభార్య ముండామోసినదయ్యా' అని చెప్పినతోడనే విరుద్ధమనుకోక చదువుకొన్న సోమయాజులుగారే నమ్మి యేడువ మొదలుపెట్టి నప్పుడు, చదువులేక మూఢురాండ్రైన మనస్త్రీలు ఇంతకంటె విరుద్ధమైన సంగతిని చెప్పినను నమ్ముదురు.

సోమ—అదిగో సుబ్బారావుగారి కుమారుఁడు గోడచాటు నుండి మనమనుకొనుచున్న మాటలన్నియు విన్నాడు.

అవ—ఇంగ్లీషుబడియందు చదువుకొనుకుఱ్ఱవాండ్రు మనవంటి వారి నెప్పుడును ఎగతాళిచేయుచుందురు. చదువులేనప్పుడే పట్టపగ్గములులేని స్త్రీలు, చదువుకూడ ఉన్నయెడల బొత్తిగానే నెత్తెక్కి మగలను వేపుకొనితినరా?

సోమి—అదిగో! ఎవరోబంట్రోతువచ్చి నిన్ను పిలుచుచున్నాఁడు.

[బంట్రోతు ప్రవేశించుచున్నాఁడు.]

బంట్రో—ఎవరయ్యా? అవధానులుగారా? తహశ్శీలుదారుగారు మీయింటికి వచ్చి మిమ్ము పిలుచుకొనిరమ్మన్నారు. వేగిరము రండి.

అవ—సోమయాజులుగారూ! వెళ్ళుదము మీరుకూడరండి.

[అందఱు వెళ్లుచున్నారు.]

౨. ప్రదేశము—అవధానులుగారి చావడి.

[తహశ్శీలుదారుగారును, గుమాస్తాయును కూరుచుండి యుండఁగా, అవధానులును, సోమయాజులును, బంట్రోతును ప్రవేశించుచున్నారు.]

తహ—ఏమయ్యా! అవధానులుగారూ! రాత్రి ప్రసవమయి, అప్పుడే ఊరివెంబడిని పెత్తనములకు బయలుదేఱినావు?

అవ—(తొందరపడి) అయ్యో! అయ్యో! ఏమిటండి? ఏమిటండి?

తహ—(నవ్వుచు) మీకు మంత్రసాని యెవరు? రాత్రి పిల్లను గన్నందుకు. కాయముపెట్టి మిమ్ము లంకణములు కట్టలేదా? మీకు పురిటినీళ్ళెప్పుడు?

అవ—(విశ్చేష్టితుఁడయి) అయ్యో! చిత్తము. (అని తెల్లపోయి చూచుచున్నాఁడు.)

తహ—(చిఱునవ్వునవ్వి) మీరేమో గడిచినరాత్రి శిశువును గని చంపి వీధిలో పాఱవేసినారని మాగుమాస్తాగారు సెలవిచ్చుచున్నారు. పొద్దున మీగుమ్మమువద్దనున్న శిశువును మీరు బలవంతముగా చంపినారా? లేక దానంతట అదేచచ్చినదా?

అవ—(వజవజ వడఁకుచు) నేనేపాపకర్మము నెఱుఁగను.ఎవ్వరో గిట్టనివారు మాయింటికి కానిస్టేబిలును పొద్దున—(అని తడఁబడుచున్నాఁడు.)

తహ—నీ వాలాగున వడఁకుచు తడఁబాటు పడుచుండుట చూడఁగా నీవు నేరముచేసినట్లే కనఁబడుచున్నావు.

గుమా—అవధానులుగారూ! మీకు వచ్చినభయములేదు. నిజము ఒప్పుకొండి.

అవ—నేనుకాదు. భీమారావుగారి మఱఁదలు—

గుమా—(చేయెత్తి యదలించి) ఈపాటిచాలించు.

సోమ—(మెల్లగా) నీపుణ్యమాయెను. ఊరకుండవయ్యా. తహశ్శీలుదారుగారు చెడ్డవారు. పెద్దమనుష్యులకు నిష్కారణముగా అవమానము—

తహ—అవధానులూ! ఏమో చెప్పవచ్చి ఊరకున్నావే మయ్యా?

అవ—అయ్యా? మఱేమియులేదు.

తహ—ఏమియు లేకపోవుటయేమి? ఈశిశుహత్యావిషయమయి నీవెఱుఁగని దేమియులేదు. తిన్నగా చెప్పకపోయిన పక్షమున శిక్ష యగునుజుమీ. భీమారావుగారి మఱఁదలని యేమోచెప్ప మొదలు పెట్టినావు. ఆసంగతి పూర్తిగా చెప్పు.

సోమ—(చెప్పవలదని చేసైఁగ చేయుచున్నాఁడు.)

అవ—(కొంచెమాలోచించి) భీమారావుపంతులుగారి మఱఁదలు బుద్ధిమంతురాలని చెప్పఁబోయి తమరశ్రద్ధగా నున్నారని చెప్పక ఊరకున్నాను.

తహ—నేను నిన్ను శిశువుసంగతి అడుగుచుండఁగా, మధ్య ఆ సంగతి యెందుకు తెచ్చినావు?

గుమా—అయ్యా! ఇతఁడు పరమ ఛాందసుఁడు. ఈపని నిజముగా ఇతఁడు చేసినిదేకాని మఱియొకటికాదు. తనమీఁదివాదు తప్పించుకొనుటకు లేనిపోని దేదోపన్నఁబోయినాఁడు. పురుషుల కప్పుడప్పుడు సంతానము కలుగుటకూడఁగలదు—ఏమయ్యా? సోమయాజులుగారూ? మొన్న మీరు పురాణము చెప్పునప్పుడు కూడ మాంధాతకో మరిమెవ్వరికో పుత్రుఁడు పుట్టినాఁడని చదువలేదా?

సోమ—అవును. చదివినాను—

తహ—సోమయాజులూ? నాముందఱ యిటువంటి పిచ్చిమాటలు చెప్పక ఊరకుండవయ్యా—ఏమయ్యా? అవధానులూ! మాటాడక మొద్దులాగున నిలువఁబడి యూరకున్నావు?

అవ—భీమారావుపంతులుగారి మఱఁదలే కనిపాఱవేసినది—

గుమా—పెద్దమనుష్యుల విషయమై యిటువంటి కారుకూతలు కూయకు.

తహ—ఆ బ్రాహ్మణుఁడు నిజముచెప్పఁబోవుచుండఁగా మధ్య మీరడ్డము వచ్చెదరేమి?

గుమా—ఈబ్రాహ్మణుఁడు బిడ్డనుకన్నమాటే వాస్తవము—

తహ—(కోపదృష్టితో) సరి సరి! మీకీప్రపంచజ్ఞానమే లేదు. నేనేమో నవ్వుటాలకన్నమాటనే నిజమని నిలువఁదీయఁ జూచెదరేమి?

గుమా—మీరు విస్తారము చదువుకొని పరీక్షలిచ్చినారన్న మాటయే కాని. ఇటువంటి విషయములలో మీకు అనుభవము చాలదు. ఇదివఱకు నాకు సర్కారులో ముప్పదినాలుగు సంవత్సరములు సర్వీసైనది. నేను పనిలో ప్రవేశించునప్పటికి మీరొకవేళ పుట్టినారోలేదో ఏలాగుననూ మీకంటె ఎక్కువ అనుభవముగల వాఁడను; నామాటయందు తమరుకొంచెము విశ్వాసముంచవలెను.

తహ—ఈసంగతిలో మీరిఁక మాటాడకండి. మగవానికి పిల్ల పుట్టినదన్న, ఎవ్వరైనను నవ్వుకొని పోదురు.

గుమా—నామాటయందు మీకు నమ్మకములేనియెడల, ఈ విషయమై గ్రామములో అందఱును ఏమిచెప్పుకొనుచున్నారో యీ బంట్రోతు నడిగి చూడండి.

బంట్రో—గ్రామమున నశేషజనమును ఈ బ్రాహ్మణుఁడే బిడ్డనుకన్నాఁడని వింతగా చెప్పుకొనుచున్నారు మహాప్రభూ!

తహ—అవధానులూ! ఊరిలో ఇంతమంది యుండఁగా, ఈ యపవాదము నీ మీఁదికివచ్చిన దేమయ్యా!

అవ—మున్ను మేమందఱమును మాటాడు కొనునప్పుడు స్త్రీలతో రహస్యము చెప్పఁగూడదని మాలో నొకరనఁగా, దానినిజమును పరీక్షించవలెనను ఉద్దేశముతో ఎవరితోను జెప్పవని ఒట్టు పెట్టించుకొని మహారహస్యమని నేను కడుపుతో నున్నట్టు నాభార్యతో జెప్పినాను. నా పెద్దకడుపు మీకందఱకును గనఁబడుచునే యున్నది కదా. ఇంతకంటె నేమియు నే నెఱుఁగను.

తహ—ఆహా! తెలిసినది. చదువులేని మూఢస్త్రీలు నిజమయిన రహస్యమును చెప్పినను దాచలేరు. నీ వన్నమాటను రహస్యముగా నీభార్య యెవ్వరితోనో చెప్పియుండును. ఆమాట ఆనోటినుండి ఆనోటిమీఁదుగాపోయి తుదకు నీవుసరిగా పిల్లను గన్నట్టే మాఱినది. ఇప్పుడు మావద్దకు వచ్చునప్పటికి, ఈ చచ్చినపిల్ల నీవుకన్నదే యయినది.

అవ—చిత్రము. చిత్రము.

తహ—మీరు స్త్రీలకు పునర్వివాహములు కూడదందురు. అవి లేకపోఁబట్టియేకదా యిట్టి ఘోరకృత్యములు నిత్యమును మనస్త్రీలలో జరుగుచున్నవి. ఎంతో శ్రోత్రియులమని చెప్పుకొనుచు, మీవంటి సోమయాజుల పేళ్ళవారే యిటువంటి ఱంకుముండలచేత లక్షవత్తుల వ్రతములు మొదలయినవి చేయించి సంకోచింపక హస్తోదకములు పుచ్చుకొని ముందుగా భోజనమునకు సిద్ధపడుదురు. మీవంటి ముసలివాండ్రు సహితము మూడేండ్లపిల్లలను పెండ్లిచేసికొనుచుండఁగా, వయసులో నున్నప్పుడు సహితము పెండ్లి చేసికొనకుండుటచే స్త్రీ [illegible]హాచారమేమి కాలినది?

సోమ—పూర్వజన్మమునందు చేసికొన్న పాపముచేత స్త్రీలు విధవలగుదురు. చేసికొన్న దెవ్వరికిని అనుభవింపక తీఱదు.

తహ—ఇట్టిస్త్రీలు పూర్వజన్మమునం దెవ్వరో, ఏమిపాపము చేయుటచేత వారి కిప్పుడీయవస్థ తటస్థించినదో మీ కేమయిన తెలియునా?

సోమ—నాకు తెలియదు.

తహ—అది తెలియకపోయిన మానెఁగాని, పూర్వజన్మమున మీ రెవ్వరో, ఇప్పుడు మీకీజన్మ మెందుకువచ్చినదో మీసంగతియైన మీకుఁ దెలియునా?

సోమ—అది అంతకుమునుపే తెలియదు.

తహ—ఈబాలవిధవ లందఱును పూర్వజన్మమునందు మీ వంటి శుద్ధశ్రోత్రియులే అయియుందురు. సందేహములేదు. పునర్వివాహము కూడదని పూర్వజన్మమునందు స్త్రీలను క్షోభపెట్టిన పాపఫలము ఈజన్మమునం దీరీతిగా అనుభవించుచున్నారు. అప్పటి పూర్వసువాసినులే యిప్పటి మీరూపములతో అవతరించి స్త్రీపునర్వివాహములు కూడవని మీరు పూర్వజన్మమునందు తమ్ముపెట్టిన బాధకై మరల కసితీర్చుకొను చున్నారు.

సోమ—తమరీలాగున సెలవియ్యకూడదు.

తహ—ఊరకే నవ్వులకన్నాను. ఈజన్మమున మనదోషము చేతనే స్త్రీలుదుఃఖము ననుభవింపుచుండుట ప్రత్యక్షముగాఁ గనఁబడు చుండఁగా, నీవు పూర్వజన్మపాప మనెద వేమయ్యా?

సోమ—తమవద్ద నేనేమి మాటాడఁగలను?

తహ—సోమయాజులుగారూ! మేము భీమారావుపంతులుగారి మఱఁదలి సంగతి విచారణచేయవలెను. మీరు ముందుగా వెళ్ళి, మేము

వచ్చెడిలోఁగా కూరుచుండుటకయి మీవీధియరుగుమీఁద చాప వేయించఁగలరా?

గుమా——(తనలో) ఈవేళ నిష్కారణముగా పెద్దమన్యుషుల కొంప మునిఁగినది.

సోమ——చిత్తము. (అని వెళ్ళుచున్నాఁడు.)

తహ——సోమయాజులు వ్యభిచారమువల్ల దోషములేదని మిట్ట వేదాంతములు బోధించి, భీమారావుపంతులుగారి మఱదలివద్ద వెనుక నేమో నాలుగువందల రూపాయలసొమ్ము కాఁజేసినాఁడట!

గుమా——అవును. ఆవేదాంతమే యిప్పుడీయన భార్యకు చక్కఁగా అక్కఱకువచ్చినది.

తహ——ఇప్పటికే మిక్కిలి ప్రొద్దెక్కినది, మనము వెళ్ళుదము రండి. (అందఱు వెళ్ళుచున్నారు.)

---

3. ప్రదేశము——సోమయాజులగారియిల్లు.

[సోమయాజులును, భార్యయు, ప్రవేశించుచున్నారు.]

సోమ——ఏమే తలుపువద్ద ఎంతసేపుపిలిచినను పలికినావుకావు? కేకలు వేసి వేసి గొంతుక బద్దలైపోయినది.

సోమి——నేను లోపల ఏమోపనిసందడిలో ఉన్నాను. మీ పిలుపు నాకువినఁబడలేదు.

సోమ——తహశ్శీలుదారుగారు మనయింటికి వచ్చెదమన్నారు. మేమింతకుమునుపు ఇక్కడ వేసికొని కూరుచున్న పెద్దచాప యేమైనదే?

భార్య——ఏమో యేమయినదో నాకేమి తెలియును? నాకు మీచాప కనిపెట్టుకొని ఉండుటతప్ప వేరే పనిలేదా?

సోమ—నేను తలుపువద్ద పిలుచుచున్నప్పుడు బుజ్జున చాప చుట్టినట్టు చప్పుడయినందున, చాపచుట్టి లోపల పెట్టినావేమో అని అడిగినాను.

భార్య—అన్ని చప్పుడులును మీకు వినఁబడును. ఆగదిలో చాపలేదు. తలుపుతీయకుండి. మీరు వీధితలుపు తీసివెళ్ళినప్పుడు, చాప యెవరెత్తుకొనిపోయినారో! మఱియెవరియింటికయిన వెళ్ళి యొకచాప తీసికొనిరారాదా?

సోమ—(ఆగది తలుపుతీసి) అదిగో మూల చాపచుట్ట కనఁబడుచున్నది.

భార్య—మీకాచాప పనికిరాదు. సుబ్బారావుగారి యింటికి వెళ్ళి మంచిచాప తెచ్చుకొండి.

సోమ—(చాపచుట్ట చేతితోపట్టుకొని లాగుచు) ఏమే చాప చుట్ట యెంతలాగినను రాక బరువుగాఁ గనఁబడుచున్నది!

భార్య—(అడ్డమువచ్చి చాపచుట్ట పట్టుకొని) ముసలివారయి నారు. చాప యెత్తుటకయినను మీచేతిలో సత్తువలేదు. నాకీచాపతో పనియున్నది. మఱియొకచాప తెచ్చుకొండి.

సోమ—(పయినుండి చాపచుట్టలో తొంగిచూచి) ఈచాప చుట్టలో ఎవఁడో కూర్చున్నాఁడు. ఓరిదొంగగాడిదకొడుకా! లోపల కూరుచున్నావేమి? పైకిలేచిరారా.

భార్య—ఊరకే లేనిపోని యల్లరిచేయకుండి. నాకు కొంచెము తలనొప్పివచ్చి యీవైద్యుని పిలిపించినాను.

సోమ—ఓరి కుక్కలకొడుకా! ఏమిరా చాపచుట్టలోనుండి యింకను లేచిరావు?

వైద్యుఁడు—(లేచివచ్చి) మాటలు మిగులఁబోకు. నీభార్యకు వైద్యము—

సోమ—లంజెకొడుకా! వైద్యము నిమిత్తమువచ్చిన గాడిద కొడుకవయినపక్షమున చాపచుట్టలో దూరవలసినపని నీకేమివచ్చి నదిరా?

భార్య—తలనొప్పిచేత బాధపడుచుండఁగా ఉపకారమునకయి మందియ్యవచ్చిన పెద్దమనుష్యుని బతిమాలుకోవలసినది పోఁగా నిష్కారణముగా తిట్టమొదలుపెట్టినారేమి? వీరసలే అనుమానపు మనుష్యులని చాపచుట్టలో—

సోమ—తాళు. ఎవరోనన్ను వీధిగుమ్మములో కేకలువేయుచున్నారు. (వైద్యునివంకఁ జూచి) పెద్దమనుష్యులు రాఁబట్టి యిప్పటికి బ్రతికిపోయినావు వెళ్ళు. వచ్చె వచ్చె కేకలువేయకుండి. (అని చాప పట్టుకొని వీధియరుగువద్దకు పరుగెత్తుచున్నాఁడు.)

[తహశ్శీలుదారు మొదలగువారు ప్రవేశించుచున్నారు.]

తహ—మేము వచ్చునప్పటికి చాపలువేయించి సిద్ధముగా ఉండుమని ముందుగానే మిమ్ముపంపినను, మేము వచ్చినతరువాతను కూడా చాపతెచ్చుటకింత యాలస్యము చేసినావేమయ్యా?

సోమ—చిత్తము. చిత్తము. లోపల మాసోమిదేవికి కొంచెము జబ్బుగానుండి వైద్యునికొఱకు వెళ్ళి తీసికొనివచ్చినాను. అందుచేత కొంచెమాలస్యమయినది. క్షమించవలెను. (అని చేతిలోని చాపచుట్ట విప్పి అరుగుమీఁద వేయుచున్నాఁడు.)

తహ—(చాపమీఁద కూరుచుండి) గుమాస్తాగారూ! కూరుచుండుండి. అవధానులూ! నీవుకూడ కూరుచుండు. సోమయాజులుగారూ! నిలువఁబడినారేమి? కూర్చుచుండరాదా? (అందఱును కూరుచున్నారు.)

గుమా—భీమారావుపంతులుగారిని పిలుచుకొని రాఁబోయిన బంట్రోతు ఇంకనురాలేదు.

తహ—వైద్యుఁడుగారూ! ఆలాగున తలనిండ ముసుఁగువేసుకొని దొంగవానివలె తలవంచుకొని పాఱిపోవుచున్నా వేమయ్యా? ఒకసారి యీలాగునరండి.

వైద్య—చిత్తము. (అని వచ్చి కూరుచున్నాఁడు)

తహ—సోమయాజులుగారి యింటికేమి పనిమీఁదవచ్చినారు?

వైద్య—కొంచెము సోమయాజులుగారితో మాటాడవలసిన పనియుండఁగా వచ్చి, ఆయనయింటలేనందున వచ్చినదాఁక కనిపెట్టుకొనియుండి మాటాడివెళ్ళిపోవుచున్నాను.

తహ—దాని కేమిగాని యీవీథిని జరిగిన శిశుహత్య విషయమయి మీకేమయిన తెలియునా?

వైద్య—నాకెంతమాత్రము తెలియదు.

సోమ—ఈయనకు తెలియని దేమియులేదు. కడుపుదిగఁబడుట కీయనేమందిచ్చినాఁడు.

వైద్య—ఈయన పురాణము చెప్పుచున్నప్పుడు వెనుక నొకసారి భీమారావు పంతులుగారి మఱదలికి మందియ్యవలసినదని నన్ను బహువిధముల బతిమాలుకొన్నాఁడు గాని నేనే ఆపని కొప్పుకోలేదు.

[బంట్రోతు ప్రవేశించుచున్నాఁడు]

తహ—ఏమోయి నీవొక్కఁడవే వచ్చినావు?

బంట్రో—భీమారావుపంతులుగారు బసలోలేరు. ఆయన మఱదలిగారికేమో పదిదినములనుండి బబ్బుగానుండి మంచము పట్టినదఁట?

తహ—మనమిప్పుడువెళ్ళి భోజనముచేసి తిరిగిన త్తము. బంట్రోతు! మధ్యాహ్నము వీరినందఱిని మాయింటివద్ద హాజరుపెట్టు.

బంట్రో—చిత్తము. మహాప్రభూ! [అందఱు వెళ్ళుచున్నారు.]

౪. ప్రదేశము—తహశ్శీలుదారుగారి పడకగది.

[తహశ్శీలుదారును, భార్యయు ప్రవేశించుచున్నారు.]

తహ—నీవు మఱియేమాట చెప్పినను విందునుగాని, ఈమాట మాత్రము వినను. ఇటువంటిమాట లెప్పుడు నాతో చెప్పఁబోకు.

భార్య—ఈవిషయములో మీరు నామాట వినకతప్పదు. భీమారావుపంతులుగారు సోమయాజులచేత నావద్దకు నూఱుకాసులను పంపినారు. వేయిరూపాయలెంతకాలము సంపాదించినవచ్చును? మీవద్ద పదియేనురూపాయలు జీతములోనున్న గుమాస్తా నాలుగువేల రూపాయలు పెట్టి మేడకట్టినాఁడు. ఆయనకోడలు మొన్న పెట్టుకొని వచ్చిన నగలుచూచిన నాకెంతో ముచ్చటైనది. నాకు నూఱువరహాల గుల్లలైనలేవు. మీరు తెచ్చెడిజీతము బువ్వకును గుడ్డలకును సరిపోవుచున్నది. మొన్న మొన్న చిన్నయుద్యోగములలో ప్రవేశించినవారందఱునుమనసువచ్చినట్టు సంపాదించి భార్యలకును బిడ్డలకును దేహము నిండ నగలుదిగవేయుచున్నారు. మీరింతకాలమునుండి పనిచేయుచున్న ప్రయోజనమేమి? నాకు పెట్టుకొన మంచిసొమ్ములేదు; పిల్లవానిమెడకు బంగారపుకంటెయైనను లేదు. మీకు రేపు కొంచెము కాలిలో ముల్లుగుచ్చుకొన్నయెడల, తరువాత నాబ్రతుకును పిల్లల బ్రతుకును ఏమికావలెను?

తహ—(తనలో) అయ్యో నేనిటువంటి యక్రమమున కెట్లు లోఁబడుదును! ఈరాక్షసి నెట్లుసన్మార్గమునకు దింపఁగలుగుదును! (బిగ్గరగా) నీవెన్ని చెప్పినను రాజకార్యవిషయములలో నీమాట వినను. మనకుధనము శాశ్వతముకాదు; దేహములు శాశ్వతములుకావు. నిత్యమయిన పరలోకసుఖమును విచారించుకోవలెను.

భార్య—మీరు నామాటవిననిపక్షమున, నేనీరాత్రి నూతిలో పడి చచ్చెదను.

తహ—చావడిలోని కెవ్వరోవచ్చినారు. నీవు లోపలికిపో.

భార్య—నామాట వినకపోయిన నేనన్నంతపనిని చేసితీరెడి దానను జుండీ. (అని వెళ్ళుచున్నది.)

తహ—(తనలో) స్త్రీలు విద్యలేని హేతువుచేత యుక్తాయుక్తములు తెలియక పశుతుల్యురాండ్రైనందునఁగదా పురుషుల కిటువంటి మనోవ్యథలు సంభవించుచున్నవి. నేను దానిమాట విననియెడల, తప్పక చెప్పినంతపనియుఁ జేయును. దానినెట్లు విడిచిపెట్టి ఊరకుండఁ గలను? ప్రత్యక్షముగా పాపకార్యమున కెట్లు ఒడిగట్టనేర్తురు? నాకేమి చేయుటకును పాలుపోకున్నది. పూర్వము మానాయనగారు బ్రతికి యున్నప్పుడు సహితము, లంచములు పుచ్చుకొమ్మని ఆయన యెన్ని విధముల నిర్బంధపెట్టినను లోఁబడక తప్పించుకొని వచ్చినాను.

[భీమారావుపంతులుగారును, గుమాస్తాగారును, ప్రవేశించుచున్నారు.]

భీమా—(కాళ్ళమీఁదపడి) మీరేలాగునసైనను రక్షించి మామానము నిలువఁబెట్టవలెను. ప్రస్తుతవ్యవహారములో మాకేమైన అవమానము తటస్థించినయెడల మాకుటుంబమంతయు ఏకకాలము నందు కట్టకట్టుకొని గోదావరిలో దిగవలసిదేగాని యిఁక మేము ప్రజలలో తలయెత్తుకొని బ్రతుకవలసినవారము కాము.

తహ—మీరు కాళ్ళువదలండి. నేను మీ వ్యవహారములో న్యాయము చేయుటకు సందేహములేదు.

గుమా—అలాగునకాదు. తమరిందులో వారిని రక్షించెదమని అభయహస్తమియ్యవలెను.

తహ—మంచిది. వెళ్ళిరండి.

గుమా—భీమారావుపంతులుగారా? తహశ్శీలుదారుగారి వాక్యము రామవాక్యము. హరిహరాదు లడ్డిపెట్టియినను, వారినోటినుండి వచ్చిన మాటకు తిరుగులేదు. సెలవు పుచ్చుకొనిరండి.

[అందఱు వెళ్ళుచున్నారు.]

---

౫. ప్రదేశము—సోమయాజులుగారియిల్లు.

[సోమయాజులును, అవధానులును, ప్రవేశించుచున్నారు.]

అవ—భీమారావువంతులుగారి మఱదలి వ్యవహారములో ఏమో ఉపద్రవము వచ్చుననుకొన్నాము. తుదకేమియులేకుండ ఇట్టే తేలిపోయినదే.

సోమ—ఇందులో మంచియిల్లాలు తహశ్శీలుదారుగారి భార్య వారిని రక్షించినది. పెద్దమనుష్యుల విషయములో మఱియొకవిధముగా జరిగించినపక్షమున నూతిలో పడెదనని ఆమె గట్టిపట్టు పట్టఁబట్టిగాని, లేనియెడల నిస్సందేహముగా పంతులుగారి మఱదలీపాటి కారాగృహము ప్రవేశించినదే.

అవ—ఇందులో నీవేమో పంతులుగారి పక్షమున లంచము పట్టుకొనివెళ్ళి తహశ్శీలుదారుగారి భార్య కిచ్చినావని గ్రామములో ప్రవాదము గలిగినది. వాస్తవమేమైన నున్నదా?

సోమ—అదినిజమే. మేమీపనిని పంతులుగారును నేనును గుమాస్తాగారును తప్ప బ్రహ్మకు తెలియకుండ మహారహస్యముగాఁ జేసినాము. అప్పుడే అందఱికిని ఏలాగున తెలిసినదయ్యా!

అవ—(ఆశ్చర్యపడి) ఈ వీధవ వ్యవహారములో తహశ్శీలుదారుగారు లంచము పుచ్చుకొన్నారయ్యా? ఏమి యీ యాశ్చర్యము!

రవ్వంత సహాయము చేసిన పక్షమున పదివేలరూపాయల నిచ్చెదమన్న సిరంవారి వ్యవహారములోనే గుడ్డిగవ్వపుచ్చుకోక వెనుక శిక్ష వేసినారే.

సోమ—అవును. అప్పుడాలాగుననే చేసినారుగాని మేమిందులో గొప్పయంత్రము చేసినాము. కన్ను చెదరునట్టుగా ఒక్కసారి నూఱు కాసులు తీసికొనివెళ్ళి తహశ్శీలుదారుగారి భార్యచేతిలో పోసి, మాకు మీరుతప్ప వేఱేదిక్కులేదని రెండుకాళ్ళును పట్టుకొన్నాము. కార్యము చేయకపోయినయెడల నూతిలోనే గోతిలోనో పడి చచ్చెదనని భార్య పట్టుపట్టి కూరుచున్నతరువాత, ఎంతమంచివాఁడును లోఁబడక యేమి చేయఁగలఁడు?

అవ—శిక్షకాకపోయిన మానెఁగాని, గ్రామములోని మన సభాపతు లందఱును పంతులుగారి మఱదలిని వెలివేసెదమన్నారు. ఆ సంగతి యేమైనది?

సోమ—డబ్బుగలవారి కెప్పుడును ఏవెలులునురావు. నలుగురు సభాపతులును నాలుగుపదులు పుచ్చుకొని రేపటిదినముజరగు కాశీ సంతర్పణలో భోజనములకు సిద్ధమయినారు. రెండేండ్ల క్రిందట ఎవరినో తీసికొని లేచిపోయి రెండునెల లావలనుండి మరలరాఁగా భీమారావుపంతులుగారింటపెట్టుకొన్నప్పు డేమిచేసినారు? అప్పుడు మీరందఱును జేరి కులములోఁ జేర్చుకొన్నారా లేదా? ఆ తరువాతనే కాదా యీయామె కాశీయాత్రవెళ్ళినది. అప్పటినుండియు సంతర్పణము జరగలేదట! రేపు సంతర్పణ జరగించి, ఆమెయే బ్రాహ్మణుల చేతులలో హస్తోదకము వడ్డించునఁట!

అవ—మన బ్రాహ్మణ్యము బొత్తిగా చెడిపోవుచున్నది. ఇప్పుడన్నిటికిని డబ్బుప్రధానము. ఈపాడు వ్యవహారము మనకెందుకు? వెళ్ళిపోదములెండి. [అని యిద్దఱును లేచి వెళ్లుచున్నారు.]

సంపూర్ణము.

హాస్యసంజీవని.

[వినోదకరముగానుండు సంభాషణలు]

మొదటిభాగము.

రచయిత:

కందుకూరి వీరేశలింగం పంతులు.

6 వ కూర్పు.

1949

ప్రకాశకులు:

హితకారిణీసమాజము,

రాజమండ్రి.

 [వెల 1-0-0

6 th Edition.
1949

విషయసూచిక.

Printed at:

DESA SEVA PRESS,

Rajahmundry.

హాస్యసంజీవని.

ప్రథమ భాగము.

ఆచారము.

[చేదస్తపు చెలమమ్మా, ఆచారపు అన్నమ్మా ప్రవేశించుచున్నారు]

చెల.—అన్నమ్మతల్లీ! యీకాలపువాళ్ళకు బొత్తిగాఆచారమన్నమాటలేదు మరీ నాకోడలు కాపురానికివచ్చినతరువాత యింట్లో పట్టిమాలకూడు కలుస్తావున్నది. యికమనవంటివాళ్లం బ్రతకకూడదు యేమైనా అంటే యెదురుకెదురు నాకే చాదస్తమంటారు.

అన్న.—చెల్లమమ్మా! చెపితే నమ్ముతావో లేదోకాని అరవై యేళ్లుదాటినా మాయింటిఆయన యిప్పటికి ఆచారమన్నమాట యెరగడు. నేనుమాత్రం యేలాగేలాగో కొంచెంఆచారంనిలుపుకొంటూ వున్నాను. మావీధిలోనుంచి ముట్టువాళ్ళు వెళితే రెండువందలుతిట్టి మాయింట్లో కుండలన్నీతీసిపారవేస్తాను. సగంముప్పాతికపాళ్ళు నానోటికివెరచి వాళ్ళు చాకిరేవుకు అవతలవీధినుంచి చుట్టుతిరిగిపోతారు. వుప్పు మొదలుకొని సమస్తవస్తువులూ రోజూ కడిగి శుద్ధిచేస్తాను. మావారు వీధిలోనుంచి వచ్చేటప్పటికియెదురుగుండా చెంబెడు పేణ్నీళ్ళు కలుపుకునివెళ్ళి మీదపోసి శుద్ధిఅయిన తరువాత మరీలోపలికి రానిస్తాను. మొన్నశీతాకాలములో రాత్రిచలివేళ మీద పేడనీళ్ళు పోసినానని కోపంవచ్చి నామగడు మూడునెలలు యింటికిరాక లేచిపోయినాడు. పోనీపొమ్మని వూరుకున్నాను. మనకు గోమయం వేస్తేనేకాని యేదీ శుద్ధికాదుగదా?

చెల—నీవు అదృష్టవంతురాలవు గనుక వొక్కమోస్తరుగా ఆచారం జరుపుకుంటూవున్నావు. నాకు నీలాగుజరగదు. అక్కడికీ నేను రోజుకు రెండువందలస్నానాలుచేస్తాను. యివేళమట్టుకు యిప్పటికి పదిస్నానాలుచేసినాను. తెల్లవారిలేచి దొడ్లోకి వెళ్ళినప్పుడు కాలికింద యేమో మెత్తగాతగిలి అదియేమిగుడ్డో అని తలనిండా స్నానముచేసినాను. తరువాత మాకోడలు దగ్గిరనుంచి వెళ్ళినప్పుడు పైటకొంగు తగిలినట్టు అనుమానంకలిగి మళ్ళీస్నానముచేసినాను. గోదావరికివెళ్ళి స్నానంచేసి బిందెయెత్తుకొనివస్తూ బట్టలువుతుక్కునేవాళ్ల నీళ్ళుపడ్డట్టు తోచి మళ్ళీవెళ్ళిమునిగినాను. తీరావడ్డుకు వచ్చేటప్పుడు నీళ్ళలోకాలికేదో ఆకుతగిలి అంటతప్పేలాలు తోమేవాళ్ళు వేసినఅంటాకని నీళ్లు పారపోసివెళ్ళి మళ్ళీస్నానముచేసినాను. తరువాత బిందెత్తుకొని సఘం దూరంవచ్చేటప్పటికి యిరవైగజాలదూరములో మాలవాడు కనబడి నీళ్ళునడివీధిలో పారపోసి వాణ్ని నాలుగుతిట్టి వాడి జీవానికి వుసూరుమంటూ మళ్ళీవెనుకకు గోదావరికివెళ్లి స్నానముచేసి నీళ్ళుతెచ్చుకున్నాను. యింటికి వచ్చిన తరువాత పొయ్యిమీద యెసరుపెట్టి దాసీది తోమితెచ్చిన గరిటె తొలుచుకోబోయి దానిని మసి వదలనందున నూతిదగ్గిర మళ్లీస్నానంచేసినాను. ఆఅంట్లతప్పేలాలలో ఒకటి తీసుకునివెళ్లి మాకోడలు లోపలపెట్టినందున, యింట్లోవస్తువులన్నీ తడుపుకొనేటప్పటికి జామయినది. తీరా వంటచేసుకుంటూవుండగా బల్లిమీదపడి వకమాటున్ను, శూద్రవాళ్లమాట వినబడి వకమాటున్నూ, రెండుస్నానాలుచేసినాను. యీలోగాఅన్నంచిమిడిపోయింది. వేగిరం మునిగివచ్చి అన్నంతప్పేలాదింపి, ఆపొయిమీద కూరవేసి గంజివార్చుకున్నాను. ప్రొద్దుటినుంచీ మడికట్టుకొని కూర్చున్నందున కడుపుబ్బి అవతలకు పోవలసివచ్చి ఆఖరు స్నానముచేసినాను. ఎన్ని స్నానా లయినవో లెక్క పెట్టినావా?

అన్న—చాలాస్నానాలు చేసినావు. నేను నీకంటె పదిరెట్లు స్నానాలుచేశాను. మాయింట్లో కుక్కవచ్చి అప్పుడప్పుడు యేమైనా ముట్టుకొనిపోతూ వుంటుంది. అప్పుడు వస్తువులన్నీ దూరముగా పారవేసి, యిల్లుశుద్ధిచేసి గోమయంపూసుకొని నాలుగు స్నానాలు చేస్తాను.

చెల—నేను మునుపెప్పుడయినా మాదొడ్లోకి గాడిదెవస్తే రాయిపుచ్చుకొని కొట్టి వూరకుండేదాన్ని. నీవు మొన్న చెప్పినప్పటి నుంచీ వకవేళ పరాకున మునపటి అలవాటుచొప్పున రాయివిసిరినా వెంటనేపోయి స్నానంచేస్తాను, నీవు మునువు రోజూ గోమయం తినే దానవు యిప్పుడు తింటూవున్నావా?

అన్న—పెద్దదాని నయినాను. మునుపటిలాగు తినలేను. అక్కడికీ మూడుపూటలూ కలిపి వుసిరికాయంత వుండ కళ్ళుమూసు కొని మింగుతాను. గోమయం యెంత తింటే అంతపుణ్యము. గోవు అల్పాచమానం చేస్తూవుండగావెళ్లి తోకతో నెత్తిమీద చల్లుకొని పంచితం మూడుపుడిసిళ్లు లోపలికి పుచ్చుకుంటే మరీపుణ్యము. ఆలాగు విడవకుండా ఆరు నెలలు ప్రతిరోజూపుచ్చుకుంటే బొందెతో స్వర్గం వస్తుందట. ఆలా యెవరికీలభించదు. మొన్న నేతి వారింటికి ప్రొద్దున్నే పేడకువెళ్లేటప్పటికి వారివెల్లావు అల్పాచమానం చేస్తూవున్నది. పంచితం నెత్తిమీద చల్లుకోవలెనని వెనుకకువెళ్ళి తోకపట్టుకునే టప్పటికి మొఖంమీద వక్కతన్ను తన్నింది. దానితో వెనక్కు పడి వక్కబొట్టయినా మీద చల్లుకోకుండానే యింటికి వచ్చినాను.

చెల—నీవు మూడుదినాలబట్టీ మొగానికి సున్నపుపట్టు వేస్తూ వున్నావు. అందుచేత నేనా?

అన్న—అవునందుచేతనే. అప్పుడు, నెత్తురువచ్చి గాయమైనది. తడిబట్టకట్టుకుంటే గాయం చీంపోస్తుంది పట్టుబట్టకట్టుకోమని మావారు మూడురోజులబట్టీ పోరుతూవున్నారు. రోజూవుతికి ఆర

వెయ్యకుండా పట్టుబట్ట మడికిపనికివస్తుందేమో నీకేమైనా తెలుసునా?

చెల—పనికివస్తుందని పెద్దలు చెప్పుతారు. భోజనముచేసి విడిచినతరువాత దర్భాసనంలోకడితే దానికి యెన్నాళ్ళయినా మయిల లేదుసుమా. మాఅబ్బాయిపట్టుబట్ట నేను ఆరునెలలకు వకపర్యాయం వుతుకుతాను. అప్పుడు దానిలోనుంచి నాలుగుకుంచాల మురికిపోయి జిడ్డు నీళ్ళల్లో తేలుతుంది.

అన్న—మడిబట్టఅంటే జ్ఞాపకంవచ్చింది. దక్షిణాదివాళ్ళకు బొత్తుగామడిలేదు. ఆదేశములో శుద్ధఅనాచారం. మొన్నమాయింటికి వకదక్షిణాదిబ్రాహ్మడు భోజనానికివచ్చినాడు. తెల్లగాపువ్వులాగు చాకలిది వుతికితెచ్చిన బట్టకట్టుకొని వూరంతా తిరిగివచ్చి ఆబట్టతో విస్తరిదగ్గరకూర్చున్నాడు. యిదేమంటే తానుకట్టుకున్న తరువాత విడువలేదు. తనది మడిబట్టే అంటాడు. వాడికేమి చేటుకాలం వచ్చిందోకాని ప్రొద్దున్నే గోదావరివొండునీళ్ళలోముంచి తెచ్చుకున్న నాపంచెచూచి కావలిస్తే నీదిమయిలబట్టఅన్నాడు.

చెల—నీళ్ళు లేకపోయినాకానీ వక్కసారి బురదలోఅయినా ముంచిపిడిచి ఆరవేస్తే మడిబట్టఅవుతుంది. ఆదేశపువాళ్ళకు మడంటే యేమిటో మయిలంటేయేమిటో తెలియదు.

అన్న—వుండు నీతోమాట్లాడుతూ పరాకున గోడమీద చెయివేస్తే బల్లితోకకామల్సను చేతికితగిలింది. అదుగో గోడమీద మాలబల్లి పాకుతూవున్నది. నేను వెళ్ళిస్నానం చెయ్యవలెను. నాలుక యిగిరిపోతూవున్నది. స్నానంచేస్తేనేగాని నోట్లోమంచినీళ్ళ చుక్క పోసుకోవల్లకాదు.

చెల—నీవు నన్ను తగలలేదుగదా నేనుకూడా స్నానం చెయ్యవలెను.

అన్న—నేను దూరంగానే వున్నానుకాని, అయినా వొందు

కయినా మంచిది గోదావరిలో వక్కమునక వేసి నీసందేహం తీర్చుకుని మరీవస్తా.

[అని యిద్దఱును వెళ్లుచున్నారు.]

అపాత్రదానము.

ప్రదేశము—రాజవీధి.

[వెంకటావధానులు ప్రవేశించుచున్నాడు.]

వెంక—(తనలో) భోజనమునకు తడుముకోనక్కర లేకుండా పదిఘంటలకల్లావాది రెండుకూరలతో వంటచేయిస్తూవున్నాడుగదా? సాక్ష్యంయివ్వడానికయిపుచ్చుకొన్న నాలుగురూపాయలలోనూ, వక్క చిల్లిగవ్వకర్చు పెట్టను. రాత్రివెళ్లినముండ ప్రతిమాటు పావలాకుతక్కువ పుచ్చుకోదు. దానిదగ్గరసంకటాలువున్న వేమోనని భయంగా వున్నది. అయినాకానీ ఫర్వాలేదు. అధమంయీరాత్రికి కావలసిన నాలుగణాలయినా యీపూట యీవూళ్లో సంపాదించవలెను. ఇవాళ సాక్ష్యంఅయితే రేపు సాయంకాలానికి మావూళ్లోకుశలంగావుంటాను. ఆవచ్చే చిన్నవాణ్ని యీయిల్లు యెవరిదో అడుగుతాను.

[ఒక చిన్నవాఁడుప్రవేశించుచున్నాఁడు.]

వెంక—అబ్బాయీ! ఈయిల్లు యెవరిది?

చిన్న—కోర్టునాజరు రామదాసు పంతులుగారిది.

వెంక—వారి యింటిపేరు యెవరు?

చిన్న—వాడ్రేవువారు.

వెంక—ఆయనతండ్రిపేరుయెవరు?

చిన్న—భీమరాజుగారు కాబోలును. నేనుబజారుకువెళ్లవలెను

(అని వెళ్ళుచున్నాడు.)

వెంక—(లోపలికి వెళ్ళి) అయ్యా! రామదాసుపంతులుగారండి. నేనుచదువుకొన్నబ్రాహ్మణ్ని తమదర్శనం నిమిత్తంవచ్చిన్నాను,

రామ—(లోపలినుండివచ్చి) మీ దేవూరయ్యా?

వెంక—మాది పడమట కృష్ణాతీరమండి. నేను జటాంతమూ వేదం అధ్యయనంచేసినానండి. మాతండ్రిగారు చయనంచేసినారు.

రామ—మీరు యీగ్రామం యెందుకువచ్చినారు?

వెంక—కాశీయాత్రకు వెళ్లవలెనని బయలుదేరివస్తువుండగా మధ్యయేలూరు దాటినతరువాత దొంగలుకొట్టి నాదగ్గిరవున్న ఝూరీ చెంబూ నాలుగుబట్టలూ పదిరూపాయలరొక్కమూ దోచుకొనిపోయినారండి. నేను యిప్పుడు కట్టుగుడ్డలతో యీగ్రామంవచ్చినాను. చేతిలోకి చెంబులేదండి. తమకీర్తిజగద్విశ్రాంతమైనదండి. మీరు దానకర్ణులు. తమరిని చూస్తే నాదరిద్రవిమోచన. అవుతుందని చంద్రుడికోసము చకోరపక్షులు వెతుక్కుంటూవచ్చినట్టు నేను మావూరు బయలుదేరినప్పటినుంచీ దోవపొడుగునా మిమ్మే స్మరించుకుంటూ వచ్చినాను. తమరు బహు దొడ్డబ్రాహ్మలు.

రామ—మీరు యిప్పుడు యేమంటారు?

వెంక—చెంబుమాత్రము మీరు కొనిపెట్టవలెను. కాశీరామేశ్వరములదాకా రామదాసుపంతులుగారు చెంబుకొనిపెట్టినారని చెప్పుకుంటాను. తమ పేరు శాశ్వతంగా వుంటుంది. అయ్యా! తమకు వాడ్రేవుభీమరాజుపంతులుగారేమవుతారండీ?

రామ—వారు మాతండ్రిగారు.

వెంక—అలాచెప్పండి భీమరాజుపంతులుగారంటేలోకప్రసిద్ధి. ఇన్ని దేశములు తిరిగినానుకాని, ఆయన వంటిదాతను నేనుమఱియెక్కడా చూడలేదు. మొదటినుంచీ మీవంశమే అటువంటిది.

రామ—మాఅన్నగారు మీజిల్లాలో తహశ్శీలుదారీ చేసి

నారు. మీరాయన నెరుగుదురా?

వెంక—ఏతాలూకాకండీ?

రామ—గుడివాడ తాలూకాకు.

వెంక—వారి నామధేయం?

రామ-వెంకటచలంగారు.

వెంక—ఓహోహో! వాౕడేవు వెంకటాచలంపంతులుగారు మీఅన్నగారండీ? వారి నెరుగకపోవలెనా! వారునిరతాన్నప్రదాతలు. మాజిల్లాలో అంతటా వారి పేరు వినికిడిమోసినది. ఆయనకు చదువుకొన్న బ్రాహ్మణ్ని అని నాయందు పరమభక్తి. ఆయనది కేవలం ఈశ్వరావతారం.

రామ—ఓయిబంట్రోతు వీధిలో యెవ్వరో కేకలు వేస్తూ వున్నారు చూడు.

బంట్రో—ఇద్దరు గుడ్డివాళ్ళండి. ముష్టి పెట్టమని కేకలు వేస్తూ వున్నారు.

రామ—గాడిదెకొడుకులను అరవకుండా అవతలికికొట్టు. ఈ వూరు గుడ్డివాళ్ళతోను కుంటివాళ్ళతోను నిండిపోయింది. తెల్లవారి లేస్తే ముష్టిముష్టిఅని నిలువ నియ్యకుండా వున్నారు.

బంట్రో—అందులో వకడు బహుముసలివాడండి. కప్పుకో డానికి బట్టసమేతూ లేదండి. చలిచేత వణుకుతూ వున్నాడు.

రామ—ముసలవాడూలేదు గిసలవాడూలేదు. వాళ్ళను అవతలికిగెంటి యీరూపాయమార్చి యీబ్రాహ్మడికి పావలాయిచ్చి తక్కినమూడు పావలాలూ పట్టుకొనిరా.

వెంక—మరివకరిద్రవ్యం కలియకుండా చెంబుకు కావలసినది తమరు దయచేయించవలెను. వక్కరూపాయిపావలాఅయితే సరిపోతుంది.

రామ—ఏమిటో మాకు తోచింది మేమిచ్చినాము. తక్కినది మరివక చోట యాచించండి.

వెంక—"యాచ్ఞా మోఘా వరమధిగుణే నాధమే లబ్ధకామా" అన్నాడండి. లేదనిపించుకొన్నా నేను తమవంటి పుణ్యపురుషులను యాచిస్తానుగాని లక్షవచ్చినా నీచులను యాచించనండి. తమరైతే గొప్ప ధర్మాత్ములే. మీసొమ్ము నాకింతే ప్రాప్తమున్నది.

రామ—ఈబ్రాహ్మడి కింకో రెండణాలుకూడా యియ్యి.

బంట్రో—చిత్తము. (ఇద్దఱును వెళ్లుచున్నారు.)

వెంక—(వీథిలో) ఈగచ్చరుగుల యిల్లెవరిదోయి?

బంట్రో—జోస్యుల-భీమయ్యగారిది.

వెంక—ఆయనకేమిపని?

బంట్రో—ఏమీ పనిలేదు డబ్బుగలవాడు. జూదమాడి రోజుకు నాలుగు రూపాయలు గెలుస్తాడు. నెలకు యిరవైరూపాయిల జీతం యిచ్చి ముండనుపుంచినాడు.

వెంక—ఆరూపాయి యిలాగియ్యి. తక్కిన పదణాలూ నేను యిస్తాను. (అని బొడ్డుకొంగు మూటతీసి చిల్లరయిచ్చి రూపాయపుచ్చుకొని బంట్రోతును పంపివేయు చున్నాఁడు.)

వెంక—(లోపలికి వెళ్ళి సావిట్లో కూరుచున్న యొక నల్లని మనుష్యుని జూచి) తమరేనా భీమయ్యగారు? తమ దర్శనంచేసి కృతార్థుణ్ని అయినాను. యిదివరదాకా తమఖ్యాతి వింటూరావడమే కాని యెప్పుడూ దర్శనమాత్రం చెయ్యలేదు, యిప్పుడు తమ మూర్తినిచూస్తే నేను విన్నదానికీ యిప్పుడు చూచినదానికీ సరిపోయినది. వుంటారు లోకములో మహానుభావులు! మీరు చూడబోతే యింత వున్నారు. మీ కీర్తిచూడబోతే మూడులోకములూ నిండినదేమండీ?

భీమ—శాస్త్రుల్లుగారూ! మీ దేవూరండీ?

వెంక__పడమట కృష్ణాతీరమండి. కాశీయాత్ర వెళ్ళుచూ, వచ్చినానండి. దారిలో దొంగలు కొట్టినారండి. మహారాజులు తమరు వకవస్త్రుందయచేయిస్తారని తమకీర్తి విని వచ్చినాను. నెలకు రెండు వందల రూపాయలు తెచ్చుకునే వుద్యోగస్తులుకూడా దాతృత్వంలో మీలో సహస్రాంశమైనా పోలరు.

భీమ—మీరు చేతిలో డబ్బులేనిసమయంలో వచ్చినారు. నిన్న వచ్చినట్టయితే నే నేమంచి పంచెలచాపు కొనిపెడుదును. అయినాకానీ యీరూపాయపుచ్చుకొని వక సైనుపంచె కొనుక్కోండి.

వెంక—చిత్తము. చిత్తము నాకు ఇదే పదివేలు. రామదాసు పంతులు నాజరీ చేస్తూవున్నాడన్న మాటేకానీ వక్కపావలా యిచ్చే టప్పటికి పెద్దలు దిగి వచ్చినారు. లోకములో దానకర్ణులన్నమాట తమకే చెల్లింది.

భీమ—శాస్త్రుల్లుగారూ! నమస్కారము.

వెంక—బహుధనకనక వస్తువాహన సమృద్ధిరస్తు. అష్టపుత్ర బహుధనమస్తు. (అని వీథిలోకివెళ్ళి తనలో) కోర్టువేళ కావచ్చినది. వేగిరం వెళ్ళవలెను. యీపూట రూపాయీ ఆరణాలు దొరికినవి. ఎప్పుడూ, నేను భోగందానితో వెళ్ళలేదు. ఈ రాత్రి యీరూపాయి యిచ్చి భోగందానియింటికి వెళుతాను. పట్నవాసాలలో భోగంవాళ్లు బహుఅందముగా వుంచారు. యింకొక సాక్ష్యందొరికితే బాగా వుండును. మరి నాలుగు రూపాయాలు సంపాదిస్తును.

(అని వెళ్ళుచున్నాడు.)

గురుశుశ్రూష

[వెంకన్నశాస్త్రుల శిష్యులగు శివయ్యయు శంకరయ్యయు ప్రవేశించుచున్నారు.]

శివ—ఏమిరా? శంకరయ్యా! మన కీముండాకొడుకు చెప్పే చదువూలేదు వల్లకాడూ లేదు. పనిచెయ్యలేక చచ్చిపోతూ వున్నాము. ప్రొద్దున్నే లేచి వంగచెట్లకు నీళ్ళుతోడిపొయ్యమంటాడు. నిన్న నేను పొయ్యలేనంటే అడ్డమయినతిట్లూ తిట్టినాడు. నీపని నయం నీకంతగా పనిచెప్పడు.

శంక—నాలాగుచేస్తే నీకు చెప్పకపోను. నీవు రాకమునుపు నన్నూ యిలాగే రోజూ వంగచెట్లకు నీళ్ళుపొయ్యమని చంపేవాడు. వాళ్ళుమండి వకరోజు యింట్లో యెవరూ లేకుండాచూచి చెట్లన్నీ పీకిపారవేసి యేమీ యెరగనట్లు వూరుకున్నాను. ఆపని యెవరో దుర్మార్గులు చేసినారని నాలుగుతిట్టి వూరుకున్నాడు. తరువాత యేలాగో రెండునెలలకు నేనే ఆపని చేసినానని తెలిసి, అప్పటినుంచీ నాకు యిటువంటి పనులు చెప్పడం మానివేసినాడు.

శివ—మావూళ్ళో శాస్త్రుర్లవద్ద రఘువంశం మూడేళ్ళు చదువుకొన్నాను. వక్క ముక్కా తెలిసిందికాదు. ఆశాస్త్రుర్లు యెప్పుడూ పనిచేయించుకోవడమేకాని పాఠమే చెప్పేవాడుకాడు. ఈవూరువచ్చి మూడునెలలయినది. ఈమూడు నెలలనుంచీ చదివినా మేఘసందేశంలో పదిశ్లోకములయినా అయినవికావు. ఆ అయిన వాటికైనా అర్థం తెలియడంలేదు 'వప్రకీడా' అంటే 'ఉద్ఘాతక్రీడ' లంటాడు. నాకు దీనికీ దానికీ కూడా అర్థంతెలియక మొన్న మన గురువుగారి నడిగితే కుశ్శంకలు చేస్తావని చెడతిట్టినాడు.

శంక—అది మనగురువుకే తెలియదు. నెల్లాళ్ళక్రిందట నేను

యిలాగంటిప్రశ్నే అడిగేటప్పటికి గురుధిక్కారం చేసినావని నన్నూ అలాగేతిట్టినాడు. శుద్ధతెలివితక్కువవాణ్ని అని అందరితోనూ చెప్ప డము మొదలుపెట్టినాడు. తరువాత నేను సంగతి తెలిసి యేమి చెప్పినా తలవూచి మహాభాగా తెలిసిందని సంతోషించడం మొదలు పెట్టినాను. అప్పటినుంచీ లోకంలో నావంటి బుద్ధిమంతుడు లేడని అందరితోనూ చెప్పి పొగుడుతూవున్నాడు.

శివ—యిఘముందు నేనూ అలాగేచేస్తాను. బట్టలు వుతుకు మంటే రోజూ రెండు బట్టలు చింపుతాను. నీళ్ళుతోడుమంటే చెంబు నూతిలోపడవేస్తాను. అక్కడితో రోగంకుదురుతుంది. అడుగో గురువుగారు వస్తూవున్నారు. పాఠంచదువుతూ వున్నట్లు కనబడ వలెను. వడిగ్గా కేకలువెయ్యి.

[వెంకన్నశాస్త్రి ప్రవేశించుచున్నాడు]

వెంక—ఏమిరా శిష్యుల్లారా? వంగచెట్లల్లో కలుపుతియ్య మన్నాను తీసినారుట్రా?

శంక—తియ్యలేదు. ఆనికె చల్లబాలువేళ శివయ్య తీస్తాడని నేను వూరుకున్నాను.

శివ—శంకరయ్య సాయంకాలం తియ్యవచ్చునంటే వూరు కున్నాను.

వెంక—ఓరి గాడిదెల్లారా! ఇప్పుడు బొత్తిగా గురుశుశ్రూష పోయినది. కుఱ్ఱముండాకొడుకులంతా బొత్తిగాపాడవుతూవున్నారు. స్కూళ్ళలో చదువుకునేవాళ్ళను చూచి మీకూ చేటుకాలం వస్తూ వున్నది. గురుశుశ్రూషవల్ల యెంతఫలం వున్నది మాకాలంలో నేను యెంతశుశ్రూషచేసి విద్యసంపాదించినాను? నేను మాగురువుగారి దొడ్డితవ్వి కూరలువేసి నిత్యం నీళ్ళుపోసేవాణ్ని; పొలంలోకివెళ్లి పశువులకు గడ్డి తెచ్చేవాణ్ని; ఆయనతోకూడా వూరంతాతిరిగి

పొత్తరలు యింటికి జేర వేసేవాణ్ని; పడుకున్నప్పుడు కాళ్ళుగుద్దేవాణ్ని; పదిహేనురోజులకు వక్కశ్లోకమయినా చదుకోవడానకు తీరుబడి లేకుండా పనిచేసేవాణ్ని.

శంక—మీరు బలంగలవారు గనుక మీరు ఆలాగు చేసేవారు. మేమిప్పుడంత పని చెయ్యలేమండి. మేమూ మాచేతనైనంత పని చేస్తూనేవున్నాము. అడుగో రామారావు వస్తూవున్నాడు. అతను స్కూలులో అరునెలలనుంచి సంస్కృతము చదువుకుంటూవున్నాడు. అతనికి మాకంటె పదిరెట్లు యెక్కువవచ్చినది. మూడేళ్ళబట్టి చదువుకుంటూవున్నా మాకుఅర్థమూరాదు యేమీరాదు.

వెంక—మీకు చదువుమెల్లిగావచ్చినా గురుశుశ్రూషాఫలం యెక్కడికిపోతుంది? దాని ప్రభావం మీరు యెరగరు. దత్తాత్రేయునకు పరిచర్యచేసి కార్తవీర్యార్జనుడు సర్వైశ్వర్యధుర్యుఁడయిన చక్రవర్తిఅయినాడు.

[రామారావు ప్రవేశించుచున్నాఁడు.]

శంక—పూర్వంవాళ్ళేమయినారోకాని. యిప్పుడు మీదగ్గిర పదేళ్ళనుంచి చదువుకుంటూవున్న శిష్యులు ముష్టియెత్తుకుంటూనే వున్నారు. చదువులేక వట్టిగాడిదలు కూడా అవుతూవున్నారు. వాళ్ళ తరువాత నాలుగువెనుకలుస్కూల్లో ప్రవేశించినవాళ్ళు పండితులయి గొప్పవుద్యోగాలు చేస్తూవున్నారు.

రామా—శాస్తుర్లుగారూ! మోచేటిపద్దం నోముచేసి లక్ష్మీదేవి అయిశ్వర్యవంతురాలున్నూ సువాసినీయున్నూ అయినదికాదండీ?

వెంక—మీకు గురుశుశ్రూషలేకపోవడంచేత యిటువంటి విపరీతబుద్ధులుపుడుతూవున్నవి. కల్లుసముద్రాలులేవంటారు. నేతిసముద్రాలు లేవంటారు. ఇంగ్లీషుచదువుకునే వాళ్ళందరూ కౌరవాది నరకాలలో పడిపోతారు. గురుశుశ్రూషా ప్రభావంచెపుచాను విను.

దానివల్ల విద్యార్థులు అహంకార విరహితులును, విజితేంద్రియులును, అవుచారు; లోకానుభవము తెలిసి వివేకవిలసితు లవుచారు; స్వామ్య తారతమ్యజ్ఞానము పొసంగును; స్థైరణమొసంగును; అవిమృశ్యకారిత యడంగును; దీర్ఘదర్శిత సెలఁగును; వర్ధిష్ణువులగు బుద్ధిమంతులు దానినే యూసింతురు; దానివలన సత్ప్రివర్తనము కలుగును; విద్యార్థులు జగన్నుతులగుదురు వేయేల? గురుశుశ్రూషవలన సమస్తైశ్వర్యములును గలుగును.

రామా—శాస్త్రుర్లుగారూ! మీరు ఫలశ్రుతి బహుబాగా చదివినారండి. మొన్న మాపురోహితుఁడు మాఅమ్మమ్మ లక్షవత్తుల నోము చేసుకొన్నప్పుడు దానివలన సమస్త సంపదలూ కలుగుతవనిన్నీ ఆయురారోగ్య పుత్రపౌత్ర ధనకనక వస్తువాహన సమృద్ధి కలుగుతుందనిన్నీ వేయిజన్మాలలో చేసినపాపమంతా పోతుందనిన్నీ స్వర్గంలో దేవతలంతా వుపచ్ఛారం చేస్తూవుంటారనిన్నీ కల్పం మీలాగే చదివినాడు. పుణ్యం వస్తుందని డబ్బులాగడానికివుపాయం కని పెట్టినారు. గురువులున్నూ యిలాగే శిష్యులచేత చాకిరీచేయించుకోవడానికి యిది వొకవేషం వేసినారు.

వెంక—ఇంగ్లీషుబళ్ళలో చదువుకునేవాళ్ళంతా వట్టిశుంఠలు; వాళ్ళకు పిన్న లేదు పెద్దలేదు. మహానుభావులు చెప్పినదాన్ని వేళాకోళం చేస్తారు. డబ్బిచ్చిచదువుకోవడంచేత మీరుచదువుకొన్న ఫలంలేదు. మీకుచదువువచ్చినాకానీ వినయాది సద్గుణములు పట్టుపడవు. జీతముపుచ్చుకొనుటచేత నుపాధ్యాయులు సేవకులగుచున్నారు; వేతనమిచ్చుచుండుటచేత విద్యార్ధులు ప్రభువులగుచున్నారు.

శంక—ఆలాగయితే విద్యార్థులు ఉపాధ్యాయులను కొట్టడానికి బదులుగా ఉపాధ్యాయులే విద్యార్థులను కొట్టుచున్నారేమండీ?

వెంక—గాడిదెకొడుకా! నీకుకూడా పొయ్యకాలం వచ్చినది.

ఈలాగంటి కుశ్శంకలు—

రామా—మీ కీవినయాది సద్గుణములు గురుశుశ్రూషవల్లనే వచ్చినవి కావండీ?

వెంక—అబ్బాయీ! లేచిపో. నిన్నుచూస్తే నాకువళ్లు మహా మండుతుంది. మీనాయనగారిని చూచి వూరకున్నానుగాని లేకపోతే—

రామా—కొంచెంశాంతించండి. మీశుశ్రూషవల్ల మీ శిష్యులకుకూడా సద్గుణము లలవడినవి. మీరు దోవలో వస్తూవస్తూ యెవళ్ళదొడ్లోనో వీధిలోనుంచి నారింజకాయలు కోయిస్తే మీ శిష్యులకు శృంగారకట్టెతో పూజజరిగిందట.

శంక—ఎవరియింట్లోనో కాదు మనవుప్పువారియింట్లోనే. మా శివయ్య గోడ యెక్కేటప్పటికి లోపలినుంచి తిట్లారంభించడంతోనే మాగురువుగారూ నేనూ సందులోనుంచి కనబడకుండా పారిపోయినాము. ఇంతలో లోపలినుంచి వచ్చిపట్టుకొని దొంగతనం చేసినావని యీశివయ్యనే మెత్తగా పిండిపెట్టిసాగనంపినారు.

వెంక—ఓరి గాడిదెకొడుకా గురుతిరస్కారముచేస్తావున్నావు యికయెందుకూ అక్కరకురాకుండా మన్నుకొట్టుకుపోచావు. రామా రావూ! మీతండ్రిగారి వద్దకు పద. (అని లేచుచున్నాడు.)

రామా—(లేచినడుచుచు) మీరుచెప్పినట్లు మీవిద్యార్థి మొన్నటినుంచీ జగన్నుతు డయినాడు. (అని వెళ్ళుచున్నాడు.)

వెంక—(కొంతదూరమువెళ్ళి) ఆనికవచ్చి మీతండ్రిగారితో నీ అకతాయతనమంతా మనవిచేసి కొట్టిస్తానువుండు. గురుశుశ్రూష లేకుండా నీవు చదుపుకొన్న చదువెందుకూ పనికిరాదు. అవక్రీత చరిత్రం చూడు.

(అని మరల వెనుకకువెళ్ళిపోవుచున్నాడు.)

పెళ్ళి వెళ్ళినతరువాత పెద్దపెళ్ళి.

---

౧. రంగము—వీధి అరుగు

[రామారావుగారును నారాయణరావుగారును వీధిఅరుగుమీాద కూరుచుండి యుండఁగా పురుషోత్తమరావుగారి కొమారుఁడు మాధవరావుగారు దారిని పరుగెత్తుకొని వెళ్ళుచు ప్రవేశించుచున్నారు.]

రామ—ఏమండీ! మాధవరావుగారూ! స్నేహితులము యింతమంది పిలుస్తూవుండగానే మాటవినుపించుకోకుండా పరుగెత్తుతూవున్నారు. మామీాఁద యింతదయ తప్పడం ధర్మమా?

మాధ—మాతండ్రిగారికి వంట్లో జబ్బుగా వుండడంచేత వెంకటాచార్లగారి యింటికివెళ్ళి అవుషధంపుచ్చుకుని పరుగెత్తుకొని వెళుతూవున్నాను. ఇప్పుడు మాట్లాడడానికి నాకు సావకాశంలేదు. మళ్ళీవచ్చి మీాతో మాట్లాడుతాను. క్షమించండి.

రా—వక్కమాటవినిపొండి మీాతండ్రిగారు మొన్ననే కాదటండీ పెళ్లిచేసుకుని వచ్చినారు. అప్పుడే జబ్బేమిటండి?

మాధ—అమ్మగారు గృహప్రవేశమూ అయ్యగారు స్మశానప్రవేశమూ అన్న సామెతనిజంగావున్నది. ఈచమురుకాళ్ళ పెద్దమ్మయేముహూర్తాన్ని పెళ్ళామయిందో కాని మంగళస్నానాలయినరాత్రి మంగళసూత్రధారణం చేసేటప్పుడే మాతండ్రిగారికి చలీ జ్వరమూ వచ్చినది. ఆనాలుగురోజులూ మళ్ళీజ్వరం రాకపోవడంచేత పెళ్ళిలోమాత్రం యేమీా యిబ్బందిలేకుండా యధావిధిగా జరిగిపోయింది.

రా—మనుగుడుపయిందా? యింకా అవశిష్టంవున్నదా?

మా—మనుగుడుపులోనే లంఖణా లన్నట్టు ఆభాగ్యంలోనే విరోచనాలు పట్టుకున్నవి. అక్కడి వైద్యుఁడు లంఖణం కట్టడంచేత

మరీనిస్త్రాణ యెక్కువయితే యిక్కడ మంచివైద్యుఁడు మన వెంకటాచార్లుగారు వున్నారని సవారీభోయీలనుచేసి రాత్రికి రాత్రి యీవూరు తీసుకునివచ్చినాను.

రా—మనుగుడుపులో యిదీ అదీ తింటే పెద్దలు గనుక అజీర్తి చేసి వుండును.

నా—విరోచనాలమీఁద లంఖణం యెంతమాత్రమూ కట్ట కూడదు. ఆ వైద్యుఁడు వట్టి తెలివితక్కువవాడుగా కనఁబడుతూ వున్నాడు.

మా—మా తండ్రిగారు అట్టే పెద్దవారుకారు. ఆయన పెళ్ళి చేసుకోవడానికి తగిన వయస్సులోనే వున్నారు. మన అందరికంటెనూ ఆయనేదృఢంగా వున్నారు.

నా—ఆయనకు అరవైయేళ్ళు దాటినవండీ?

మా—యెక్కడివండీ? మొన్నటిభాద్రపదమాసానికి యాభై నాలుగు సంవత్సరములు దాటినవి. మీఁదటికి పింఛన్ పుచ్చుకొని యింటికాడ కాలిమీఁద కాలువేసికొని కూర్చుండి భార్యతో సుఖ పడవలెనని యత్నిస్తూవున్నారు.

నా—కొత్తపెళ్ళికూతురు యెవరిచిన్నదండీ?

మా—యెవరిచిన్నదైతేనేమి? కస్తూరివారిచిన్నది.

నా—ఆచిన్నదాన్ని నేను యెరుగుదును. చిన్నదానికి ఫది సంవత్సరములుంటవి; బహు లక్షణవతి.

మా—యేచక్కదనంవుంటే నేమిగుణంమాత్రం మంచిది కాదు. పెళ్ళిరోజుననే నాకీమగడువద్దని యెక్కడలేని అల్లరిచేసి వక పట్టాన బీటమీఁద కూర్చున్నదేకాదు. అన్నగారువచ్చి నాలుగుకొట్టి బలవంతంగా పీటమీదకూర్చో పెట్టినాడు.

నా—అలాగైతే మొగుడితో బాగానే సంసారం చేస్తుంది.

మా—దాని సంసారంయిల్లు బంగారంగాను మాతండ్రిగారికి యిప్పుడు నిమ్మళంగావుంటేనేతప్ప మరివకవిధంగాఅయితే తరువాత మనోవర్తికోసం మాప్రాణాలమీద కూర్చుంటుంది. కాపురానికి వచ్చినతరువాత సవితిబిడ్డలను మమ్మల్నితిన్నగా చూస్తుందండీ?

నా—మీకు వయస్సెంతండీ?

మా—నాకు యిప్పుడు యిరవైయేడో సంవత్సరము.

రా—కావలిస్తే ముండను వుంచుకోవచ్చును. పెద్దతనంలో పెళ్లి చేసుకోవద్దని మీతండ్రిగారితో ఘట్టిగా చెప్పలేకపోయినారా?

మా—ఆయనకు మాతల్లిగారు జీవించివున్నప్పటినుంచీ వక ముండ వున్నది. యెంత మంది ముండలువున్నా చేసుకున్న పెళ్ళాము వంటిదికాదని ఆయన భ్రమపడ్డారు. ఆయన మాతల్లిగారు పోయిన పదమూడోనాడే వివాహం చేసుకోవలెనంటే మా నిర్బంధంచేతనే యీడాదివరకూ మానివేసినారు.

నా—ఇంత పెద్దవాళ్ళకు తల్లిదండ్రులు పిల్లనేలాగు యిస్తారండీ?

రా—డిస్ట్రిక్టలెక్టరీ చేస్తావుంటే డబ్బుకాశపడి చచ్చినశవానికి పిల్లనిమ్మంటే లక్షణంగా ఇస్తారు.

మా—మాటలసందడిని చాలాసేపయినది. మాతండ్రిగారికి వేగిరం అవుషధం యివ్వవలెను. నేను వెళ్ళుతాను. మీరు వక్క పర్యాయంవచ్చి మాతండ్రిగారిని చూచిపోరా?

రా—మేమూ లోపలికివెళ్ళి మంచిబట్టలు కట్టుకునివస్తాము. మీరు నడుస్తూ వుండండి.

మా—చిత్తము. సెలవుపుచ్చుకుంటాను. (అని వెళ్లుచున్నాడు)

నా—ఇక వెంకటాచార్లచేతిలో పడ్డతరువాత నాచేతిమాత్రా వైకుంఠయాత్రా అన్నట్టు యీఘటం నెగ్గేదికాదు. మనము వెళుదాముదండి. (అని వెళ్ళుచున్నారు)

---

౨. రంగము—పురుషోత్తమరావుగారి యిల్లు.

[వైద్యుఁడు వేంకటాద్యులును, సిద్ధాంతి శివయ్యయు, బంధువులు వరదరాజును, కనకరాజును ప్రవేశించుచున్నారు]

వర—యెట్లావున్నదని చెప్పను? పూర్ణంగా వాయువుచేసుకుని వున్నది. వైద్యలోపం యెంతమాత్రమూ లేదు. వైద్యుఁడు చేతనయిన పని అవుషధం యివ్వగలడుగాని ఆయుర్దాయం పోయగలడా! యింతకూ కొత్తగా పెళ్లిచేసుకొన్న పెళ్ళాముయొక్క అదృష్టం యేలాగువున్నదీ తెలియదు.

కన—ఆవిడ అయిదోతనం తిన్నగావుంటే మీ వైద్యం రాకనే పోను. ముసలివాణ్ని లంఖణాలుకట్టి నిష్కారణంగా పాడుచేసినారు.

వెంక—అబ్బాయీ! నీవు చిన్నవాడవు నీకు యేమీ తెలియదు. వూరుకో. లంఖణాలలో యెంతగుణం వున్నదనుకొన్నావు యేమిటి? "లంఘనం పరమౌషధం" అన్నాశాస్త్రకారు డంతవెఱ్ఱివాడేనా? నేను చెప్పినప్రకారంవిని మధ్యలంఖణం చెడగొట్టకుండా వున్నట్టయితే నాలుగు లంఖణాలతో రోగం నిశ్శేషమయి పోయేది. మధ్య డ్రెస్సరుని వకణ్ని తీసుకునివస్తే వాడు గోధుంజావపోయించి రంగమంతా చెడగొట్టినాడు. తీరా చెడిపోయినతరువాత యెన్ని లంఖణాలు కడితే యేమివున్నది? యెన్నిమందులువేస్తే యేమివున్నది?

కన—డ్రెస్సరు అవుషధం యిచ్చినది వక్కపూటేకాదూ?

వెం—చెడగొట్టడానికి వక్కపూటకాదుగదా వక్కనిముషం చాలును. యిందులో నా వైద్యలోపం పిసరంతలేదు. డబ్బుకు వెనుకా ముందూ చూడక దివ్యౌషధాలు కుప్పెలు పగలగొట్టిపోసినాను. వాతరాక్షసం, వాతవిధ్వంసి, వాతాంతకరసం, వాతమూషిక మార్జాలం, వాతపన్నగగారుడం; ప్రళయాగ్నిరసం మొదలయిన

కాకచేసే అవుషథాలన్నీపోసినాను. చివరకు చింతామణికూడా వేసినాను.

కన—ఈఔషధాల పేర్లన్నీ యెప్పుడు వల్లించినావయ్యా! నీదగ్గిర డబ్బులేదుగదా వైద్యశాస్త్రం చదువుకోనిదీ యీ అవుషధాలన్నీ యెట్లాచేసినావు?

వర—పెద్దల్ని ఆక్షేపించరాదు. వూరుకో. ఆయన యేఔషధాలూ లేకపోతే వూళ్లో అందరికీ యెలాఅవుషధం యిస్తూవున్నాడు? వైద్యుడియందు గురివుంటే ఆయన మన్నుసలిపి చేతిలోపెడితే యెటువంటిరోగాలూ నిముషంలో కుదురుతవి.

కన—ఈయనను మాన్పించి డాక్టరుచేత అవుషధం యిప్పించినట్టయితే వ్యాధి నిమ్మళించేది.

వర—ఆవైద్యం తెల్లవాళ్లకేకాని డాక్టరువైద్యం నల్లవాళ్లకు యెంతమాత్రమూ పనికిరాదు. వాళ్లుమాంసమూ రొట్టే తింటారు గనుక వాళ్లతత్వాలకూ మన తత్వాలకూ చాలా భేదంవుంటుంది. మన తత్వాలమీద నల్లవైద్యమే బాగానడుస్తుంది.

వెం—తుదకబ్బెరాతురకకూడన్నట్టు లోక్యులందరూ పోగయి యింత శిష్టుగావున్న బ్రాహ్మడికి అవసానకాలమందు మాలనీళ్లు నోట్లోపోయించడానికి మాధవరావుగారిని డాకుదొరకోసం పంపించినారు. డాక్టరు డాక్టరనడమేకాని వాళ్లకు నాడి చూడడమైనా తెలుసునండీ?

కన—అన్నీ నీకే బాగాతెలుసును. మీరందరూ ఆశవదలుకున్న మీపెత్తండ్రికుమారుడికి మొన్ననేకాదూ డాక్టరు కుదిర్చినాడు?

వెం—వాళ్లు రణవైద్యంలో ఘట్టివాళ్లు. అంతేకాని మరివక దానిలో పనికిరారు. వైద్యంమాట నల్లకాదుగాను మాలనీళ్లుతాగి

బ్రాహ్మణీకమూ మతమూ పోగొట్టుకోమండీ? డాక్టరువస్తే ముందుగా పొక్కుపాలాస్త్రీ వేసి ప్రాణంవుండగానే చంపివేస్తాడు.

శివ—ఈవైద్యాలవల్ల యేమీ కార్యంలేదు. ఇప్పుడు పురుషోత్తమరావుగారికి శనిచాలదు; నవగ్రహజపంచేస్తే అంతానిమ్మళిస్తుంది. నేనుపోరి నాలుగు రోజులనుంచి జపాలు చేయిస్తూవున్నాను. గుళ్లోకి అభిషేకాలనిమిత్తం బ్రాహ్మలువెళ్లినారు. అభిషేకం చేసి వచ్చి తీర్థంలోపలికియిస్తే కాస్తసేపటికి అంతా నిమ్మళంగా వుంటుంది.

వర—పంతులుగారికి కీళ్లన్నీ నొప్పులుగావున్నవి. నాకుచూస్తే ప్రయోగలక్షణంగా కనబడుతూ వున్నది. అయినాకానీ బుద్ధిమంతులు మీరుకూడా ఆలోచించవచ్చును.

శివ—నాకూ ఆసందేహమేతోచి భూతవైద్యుణ్ని పిలిపించి వీభూతిపెట్టించినాము. తెల్లవారిగట్ట ఆడవాళ్లు సోదికివెళ్లితే పేరంటాలుగుడివద్ద మాలదికూడా పెద్దపెళ్లాము పట్టినదనీ విరోధులు ప్రయోగంచేసినారనీకూడా చెప్పినది. ఈనవగ్రహజపాలు అన్నింటికీ మంచివే. గ్రహశాంతికయి బ్రాహ్మణసంతర్పణ మాత్రం బాగా జరగవలెను.

వర—ఆగండి. లోపలనుంచి కామావధానులుగారు యేమిటో కేకలు వేస్తూవున్నారు—ఏమండోయి కామావధానులుగారూ.

కామా—(లోపలినుంచి) మాధవరావుగారు యింకా రాలేదు గదా? ఈపాటిపంతులుగారికి ప్రాయశ్చిత్తం చేస్తే బాగావుంటుంది. దక్షిణ యివ్వడానికి మాధవరావుగారు లేరు యేమిబుద్ధి?

వర—యింతలోకే ఫర్వాలేదు. కొమారుడు వచ్చినదాకా ఆగండి.

కామా—యింకాయేమి ఆగమంటారు? యిఘడాక్టరు జరూరు లేదు. కనిపెట్టుకొని వుండక తక్షణం బయలుదేరి రమ్మని వర్తమానం

పంపించండి. మంచంమీఁద ప్రాణాలు పోకుండా మనము పంతులు గారిని భూశయనం చెయ్యవలెను. మాధవరావుగారు మంచిసమయానికి లేకపోయినారుగదా? నాకు యిప్పుడు వుత్క్రమణగోదానం వస్తుంది. ప్రాణోత్క్రమణ సమయం వచ్చింది.

వర—అబ్బాయీ! మనంయేదోవక వంక పెట్టుకుని వెళ్ళిపోదాము రా. అట్టేవుంటే పీనుగును మొయ్యమంటారు.

కన—యిటువంటి ఆపదవచ్చినప్పుడే సహాయం చెయ్యకపోతే మనబంధుత్వంయెందుకు తగలబెట్టనా? నేనురాను. కావలిస్తేమీరు వెళ్లండి.

కామా—వేగిరం లోపలికి రావలెను. పంతులుగారికి ఆఖరు యెగుపులువచ్చినవి. ప్రాణాలు పోయినట్టున్నవి.

వర—నేను మాధవరావుకోసం వెళ్లుతాను. మీరు తదంగంకానిస్తూవుండండి. నక్షత్రం మంచిదేమోచూడండి. కాకపోతే యిల్లువదిలి పెట్టవలసి వస్తుంది. జరూరుంటే ఆయనను పంచపాళీలోపెట్టండి. (అందరు నిష్క్రమించుచున్నారు.)

ఉన్మత్తప్రలాపము

[చెన్నపురిలోని యున్మత్తవైద్యశాలలో పిచ్చిపంతులుగారును, వెఱ్ఱిశాస్త్రుల్లుగారును సంభాషించుచుండఁగా వివేకాచార్యులుగారు ప్రవేశించుచున్నారు.]

పంతు—శాస్త్రుల్లూ! అడుగో ఆచార్లు వస్తూవున్నాడు. వాడి మొఖంమండ; వాడిల్లువల్లకాడుగాను.

శాస్త్రు—(మెల్లగా) ఆచార్లు వంటిగా వస్తూవున్నాడు. మనం యిద్దరం వున్నాము కొడదామా ?

ఆచా—యేమోయి పంతులూ! దారిపట్టుకు పోయేవాణ్ని నిష్కారణంగా ఆలా తిడుతూవున్నావు. అమావాస్యకూ పౌర్ణమికీ పిచ్చ యెక్కు వవుతూవుంటుంది. ఇవాళ పౌర్ణమిగనుకనా ఆలా వాగుతూవున్నావు?

పంతు—మావంటి వుత్తమపురుషుల గ్రహచారంచేత మన దేశానికి మ్లేచ్ఛప్రభుత్వంవచ్చి బొత్తిగా వర్ణసంకరం అవుతూవున్నది; యెక్కడచూచినా వట్టి మాలకూడు జరుగుతూవున్నది. ఇప్పుడు వెనుకటికాలమయితేనా నీవంటి దుర్మార్గులనందరినీ యీలాగంటి "ఆర్యగర్హిత మయిన" పనులు చేస్తూవున్నందుకు వక్కదెబ్బను తలలు బద్దలకొట్టి చంపివెయ్యమూ?

ఆచా—ఆత్మస్తుతి పరనిందా మహాబాగా చేసుకుంటూ వున్నావు. యెన్నాళ్ళు వాగుతావో వాగు—నీ నోరు నొప్పిపెట్టి నీవే వూరుకుంటావు. నీవంటిపిచ్చివాళ్ళ నేమాటలకు నాకు యెంతమాత్రమూ విచారంలేదు. పిచ్చివాడవు కావడంచేత నీవు యెన్నితిట్లు తిట్టినా కోపంరావడానికి బదులుగా నిన్నుచూస్తే నాకు జాలివేస్తున్నది.

పంతు—ఇటువంటి పేలాపన పేలుతూవుంటే నాకు పిచ్చి యెత్తి వళ్ళుతెలియక యేమయినా చేసిపోతాను లేచిపో. నాకు నిజంగా పిచ్చియెత్తినట్టయితే యీపాటి నీ తలకాయ రెండుచెక్కలుచేసి నా అక్కస్సంతా తీర్చుకోనూ?

ఆచా—వెఱ్ఱి వేయివిధాలన్నాడు. నీకు పిచ్చి వేరేయెత్తనక్కరలేదు. ఇదివరకే కావలసినంతవున్నది. మరీపిచ్చ యెక్కువైన వాళ్లు కనపడ్డవాళ్ళ నందరినీ కొడుతారు. నీవంటి సాధారణపు పిచ్చవాళ్లు తిట్లతోమాత్రం సరిపెడుతారు. పర్వదినాలలో పిచ్చ ముదురుతుందికాబట్టి నీవు నెలకు వకపర్యాయం పౌర్ణమిపౌర్ణమికీ అందరినీ

తిడుతూ వుంటావు. నీపిచ్చ యెప్పుడుకుదిరి మంచివాళ్ళలో పడుతావా అని భగవంతుణ్ణి యెప్పుడూ ప్రార్థిస్తూ వుంటాను.

పంతు—యేడుస్తూవుంటావు. ఇప్పుడు కానికాలాలువచ్చినవి. యేమీ నోరెత్తవల్లకాదు. మాలప్రభుత్వంకావడంచేత అన్నీ నిర్బంధాలే. అడ్డమయినవాళ్ళూ చదువుకోవడమే; అడ్డమయినవాళ్లూ ఉద్యోగాలు చేయడమే; యెవరినీ కాస్తతిట్టవల్లకాదు; కొట్టవల్లకాదు యీ పాడుకలికాలం యెప్పుడుపోతుందో.

శాస్త్రి—ఒక్కమగవాళ్ళకేకాకుండా యెన్నడూయెరుగము. ఆడవాళ్ళకుకూడా చదువువచ్చిందయ్యా! ఆడముండల చదువుమూలాన్ని యెక్కడా నిలవడానికి వల్లకాకుండావచ్చింది. గరల్‌స్కూలులో చదువుకుందట. దానిచదువు చట్టుబండలుగాను మూడేళ్ళముండ నాపెళ్ళాము పేడముట్టుకుంటే అసహ్యంఅని నన్ను యెదిరిస్తుంది. గోమయం యెంతశుచిఅయినవస్తువు? నా బ్రతుకుపెట్టుకుని మొన్న అమావాశ్యనాడు దానిచేత మూడు పేడవుండలు మింగించలేకపోయినాను.

ఆచా—ఓయిపిచ్చబ్రాహ్మడా! నీకు అమావాశ్యనాడు పిచ్చయెత్తుతుందాయేమిటి? అసహ్యంలేకుండా పేడముద్దలు మింగమనడం యేమిటయ్యా?

శా—అమావాశ్య పితృదినంగనుక శుచిగా వుంటేనేకాని బ్రాహ్మడికి పెట్టడానికి పనికిరాదని కాస్తగోమయం వంటికిరాసుకొని శాస్త్రార్థం కాస్తలేసి గోమయంవుండలు నోట్లోవేసుకొని తలనిండా స్నానం చెయ్యమన్నాను ఛదేళ్ళముండ మాన్యమూ యిల్లు అమ్మి వెయ్యిరూపాయిలు పొయిలోపోసి కొనుక్కొన్నందుకు మొగుడుమాట విననక్కరలేదూ? ఛదేల్లముండ అరవయియేళ్ళువచ్చిన నామాటే వినకపోతే యిఖ యెవరిమాట వింటుంది?

పంతు—యిప్పటి ఆడవాళ్ళు మొగుడిమాటవినేవాళ్ళు గినేవాళ్ళు కారు. ముందున్నది ముసుళ్లపండుగని నీపాట్లు ముందున్నవి.

నీపెళ్ళాంయెదిగి కాపురానికి వచ్చినతరువాత నాజ్యోతిషం నిజమయిందని అప్పుడు తెలుచుకుంటావు. ఆడముండలకు చదువు వచ్చిన తరువాత వాళ్ళు లొంగుతారటయ్యా? యీచదువు మనపుట్టి ముంచివేస్తూవున్నది. యేమీకాకపోతే మనము యేనాడయినా యీ వెధవముండల పెళ్ళిళ్ళు వినీ కనీ యెరుగుదుమయ్యా? కలిమహాత్యం చేత యీ విపరీతాలన్నీ పుడుతూవున్నవి. "కలౌ పంచసహస్రాణి జాయంతే వర్ణసంకరాః" అన్నాడు. ఇక కొన్నాళ్ళల్లో అంతా వర్ణసంకర మయిపోతుంది.

శా—మీరు విధవపెళ్ళిళ్లంటే నావళ్లు వణుకెత్తుతూవున్నది. యెరక్కపోయి ముదిసి ముప్పైన చదువుకున్నముండను కట్టుకున్నాను. ముండామొయ్యడంతోటే అది మళ్ళీ యెక్కడ పెళ్లిచేసుకుంటుందో! ఓ భగవంతుడా! అది విధవావివాహం చేసికోవడం నాకళ్ళ పడకుండా చేస్తూ.

ఆచా—శాస్తుర్లూ! నీవు బ్రతికీవుండగా నీపెళ్ళా మెట్లా ముండా మోస్తుందయ్యా? వెర్రివాడివలె వున్నావు. అరవైయేళ్లు దాటిన తరువాత మాన్యాలూ మళ్ళూ తెగనమ్మి యిది యెందుకు వచ్చిన పెళ్లయ్యా? కాటికి కాళ్ళుచాచుకొని నీవు యింకా చిన్నపెళ్ళాముతో కాపురంచేసి సుఖపడుదామనే పెళ్లిచేసుకున్నావా? నీవన్నట్టు నీ పెళ్ళాం మళ్ళీపెళ్లిచేసుకుంటే నీవంటి ముసలిముండాకొడుకుల కందరికీ చిన్నపిల్లలను వివాహమాడి వాళ్లకొంప తియ్యకుండా వక్కమాటు బుద్ధివస్తుంది.

శా—నేను కర్మచెడిపోతుందని గృహస్థధర్మానికి పెళ్లిచేసుకున్నానుగాని సౌఖ్యంకోసం చేసుకున్నానండీ? నా మూడో పెళ్లాము బ్రతికివున్నప్పుడే నాకు సంసారసుఖం అక్కరలేకపోయింది. పెద్దవాణ్నయినాను గనుక యజ్ఞంచేస్తే స్వర్గసుఖం కలుగుతుందని అపత్నీకుణ్ని కాకుండా వుండడానికి పెళ్ళిచేసుకున్నాను.

ఆచా—నీవు యజ్ఞంచేసి చస్తావో లేదో కాని నీతదనంతరము మళ్ళీ పెళ్ళి చేసికోకుండావుంటే నీ పెళ్ళాంమాత్రం నరమేధయాగాలు చాలా చేస్తుంది. యజ్ఞఫలం అప్పుడు నీకు పూర్ణంగా లభిస్తుంది.

పం—మళ్లీ పెళ్లి చేసుకున్నవాళ్లు కులభ్రష్టులయి యెందుకూ పనికిరాకుండా బోతారు. మొన్న పెళ్లిచేసుకున్నవాళ్లతో గలిసి భోజనం చేసినంతమాత్రంచేతనే వకపెద్దమనిషియింటిమీద పిడుగు పడ్డది. పెళ్ళిచేసుకున్నవాడియింట్లో ముసలిముండ చచ్చిపోయింది. ఇటువంటి దుష్కార్యాలలో ప్రవేశిస్తే యేకీడూ మూడకుండా వూరికేపోతుందాయేమిటి? సజ్జనఘోష తగలకమానదు.

ఆ—శాబాస్! నీవన్నపలుకులు మెచ్చతగివున్నవి. నీవన్న మాటలు దొరతనంవారికి తెలిస్తే నీకు చాలా బహుమానం చేస్తారు. ఇది రాణీగారువింటే నీకాళ్లకుగట్టి లోహంతో అందెలూ గొలుసులువేసి గవర్నమెంటువారు కట్టించిన దివ్యభవనాలలో కాపురం వుంచి సర్కారు జీతాలమీదవుండే భటులను కావలియిచ్చి యెల్లకాలమూ అన్నవస్త్రాలు దొరతనంవారి ఖర్చుమీదనే యిస్తూవూరుదాటి వెళ్లనక్కరలేకుండా నిన్ను బహు ఆదరణచేస్తారు. యీ మహారాజయోగం నీకు యెప్పుడో తప్పకుండా పడుతుంది. భోజనము చేసినవారి యింటిమీద పిడుగుపడితే అపాయంలేకుండా పోయిందిగాని, సర్కారులెఖ్ఖలుచూస్తే యీయేడు పిడుగుపడి హిందూదేశములో నలభైతొమ్మండుగురు కాలంచేసినారు. వాళ్లంతా విధవావివాహాలు కూడదనేవాళ్ళేనట. అదంతా యెందుకు యీపట్నంలోనే వక్క వారం దినాలలో విధవావివాహాలు వద్దనేవాళ్ళు బహురోగాలచేత బాధపడిరెండువందలమంది చచ్చినారు. ఆడవాళ్లవుసురు కొట్టకుండా వూరికే పోతుందనుకున్నారా!

పం—నీతోమాట్లాడితే పాపంవస్తుంది. మీకందరికీ యీ లాగంటి దుర్బుద్ధులుపుడుతూవున్నవి గనుక నేయిప్పుడంతా అర్ధాయుష్షు ముండాకొడుకులు, పుడుతూవున్నారు. యీదుర్మార్గ పరిభుత్వంమూలాన్నిగాని లేకపోతే నిన్నునిలువుడుగొయ్యితీసిపాతివేస్తును. రావయ్యాశాస్తుర్లూ లోపలికివెళుదాము.

ఆచా—యెన్నినిర్బంధాలువున్నా యెంతభయంవున్నా పిచ్చవాళ్లుగనుక నోటికివచ్చినట్టు వాగడానికి మీకేమిఅభ్యంతరంలేదు. పిచ్చవాళ్ళతో వాదంచేసి ఘంటసేపువ్యర్ధంగా పోగొట్టినాను. మీరు యెన్నికారుకూతలు కూస్తువున్నా అయ్యేవేవో కానే అవుతవి. నేను వెళ్లిపోతాను.

(అని అందఱును నిష్క్రమించుచున్నారు.)

గ్రహణములు

[పంతయ్యపంతులును సింగయ్యసిద్ధాంతియు ప్రవేశించుచున్నారు.]

సింగ—పంతులూ? ఏమిషయ్యా పేపరు చదువుచూవున్నావు?

పంత—పఋ అమావాస్యనాడు సూర్యగ్రహణమటండి.

సింగ—యేడిశారులే. నేనుపంచాంగం గుణించినాను. యెక్కడాగ్రహణంరాలేదు. పేపర్లల్లోఅన్నీఅబద్ధాలేవేస్సారు వాళ్లమొఖం తెల్లవాళ్లకు చాలూమూలం తెలియదు. యేదియెట్లాపోయినా బ్రాహ్మణీకం నిలపడానికి గ్రహణాలు వక్కటిదాఖలాగా వుంచూ వున్నవి.

పంత—వక్కబ్రాహ్మలేకాని తెల్లవాళ్లు గ్రహణాలుయెప్పుడువస్తవో చెప్పడంలేదా? ఇందులో మీఆధిక్యంయేమిటి?

సింగ—బ్రాహ్మలుచెప్పినట్టు వాళ్ళు వెయ్యేళ్ళుతల్లక్రిందయినా చెప్పలేరు. బ్రాహ్మలవద్దనే మర్మంగ్రహించివాళ్ళూ యిప్పుడిప్పుడు కొద్దిగా తంటాలుపడుచూవున్నారు. బ్రాహ్మలుడబ్బుకోసం కక్కుర్తి పడి మనశాస్త్రాలన్నీ వాళ్ళకుచెప్పిపాడుచేస్తూవున్నారు. రహస్యంగా వుంచితే శాస్త్రంకాని, అందరికీ తెలిస్తే శాస్త్రంయేమిటి! శాస్త్రాలనగా మంత్రాలనగా అందరికీ తెలిస్తే పాటితప్పిపోచవి. దానికేంగాని తెల్ల వాళ్ళు గ్రహణాలకు యేమికారణం అంచారయ్యా?

పంత—సూర్యుడికీ భూమికీమధ్య చంద్రుఁడు అడ్డంవస్తే సూర్యగ్రహణం పడుతుందంటారు. సూర్యుడికీ చంద్రుడికీ మధ్య భూమివుండి భూమినీడ చంద్రుడిమీదపడితే చంద్రగ్రహణం పడుతుందంటారు.

సింగ—రామరామరామా! యెంత అబద్ధాలు వ్రాసినారయ్యా? వాళ్ళకు వక్కటీ తెలియదు. అన్నివిషయాలలోనూ యిలాగే శాస్త్రజ్ఞానంలేక యుక్తులు తెచ్చి సంకరంచేసి పాడుచేస్తూ వున్నారు. నాకు వెయ్యిరూపాయలుయిస్తే గ్రహణాల సంగతి సమర్మంగాచెప్పి సంశయం వదిలిస్తునే. ఖజానాలో అన్నిరూపాయలు వున్నవి. నిష్కారణంగా కాలవలకిందనూ రోడ్లకిందనూ పెట్టి పాడు చెయ్యకపోతే సద్బ్రాహ్మణ్ణి నాకు వెయ్యిరూపాయలు యిచ్చి యిల్లుకట్టించియిస్తే వాళ్ళకు యెంతపుణ్యం వుంచుంది? ఈవుద్యోగస్తులంతా వూరికే లంచాలు కాచెయ్యడమేకాని యిటువంటి సత్పాత్ర దానం వక్కటి వాళ్లచేత చేయించరు. ఇప్పుడు బొత్తిగా బ్రాహ్మణ భక్తిపోయింది. మాణిక్యంవంటి కర్మభూమంతా కిరస్తానీమయమయి పోయింది.

పంత—రేపునాకు వుద్యోగం అయితే కలకటరుగారితో చెప్పి మీకు మాన్యం యిప్పిస్తానుగాని గ్రహణాలసంగతి యేమిటో నాకు సమర్మకంగా చెప్పండి.

సింగ—నాకు యెక్కడనో దూరంగావుండే మాన్యం పనికి రాదు. నామాన్యానికి తూర్పువైపునవున్న గమళ్ళవాడిమాన్యం వాణ్ని వెళ్ళగొట్టివేసి నాకుయిప్పించండి. అలాయిప్పిస్తానని నా చేతులో చెయ్యివెయ్యండి మీకుతప్పకుండా మీదటికి శిరస్తాదారీఅవుచుంది. ఇదియెంతకలికాలంఅయినా బ్రాహ్మణవాక్యం వూరకేపోదు. అందులోనూ తపశ్శాలినిగనుక నావాక్యంఅమోఘంగాపట్టుకుంచుంది. వాడిజీవనం చెడగొట్టడంవల్ల మీకుయేమీ పాపంలేదుసుమండీ? వాడికేమి తట్టుగాలా? గమళ్ళముండాకొడుకు మాన్యంలేకపోతే కల్లు గీచుకొని బ్రతుకుచాడు. అప్పుడువాణ్ని కులవృత్తిలో ప్రవేశపెట్టి వర్ణాశ్రమధర్మంనిలవపెట్టిన పుణ్యంకూడా మీకువస్తుంది. యేదైన కానీ బ్రాహ్మణపూజతో సమానమయిన పుణ్యం మరివకటిలేదు. దేవుడైనాకానీ బ్రాహ్మణవాక్యం అంటే శిరసావహిస్తాడు. శ్రీకృష్ణమూర్తివారిని చూడలేదా? బ్రాహ్మణులను తిరస్కరిస్తేనే కాదా ఇంద్రద్యుమ్న మహారాజు యేనుగై పుట్టినాడు. నృగమహారాజు వూసరవిల్లి అయిపోయినాడు.

పంత—ఆగొడవంతా యెందుకు? గ్రహణాలసంగతి సెలవిస్తురూ.

సింగ—పూర్వం సముద్రమధనకాలమందు గాడిదకొడుకు రాహువుగాడు దేవతలలోకూర్చుండి అమృతం తాగినాడు. ఆసంగతి సూర్యుడూ చంద్రుడూవెళ్ళి చెప్పేటప్పటికి శ్రీవిష్ణుమూర్తివారు చక్రంధరించి వాడితల రెండువక్కలు చేసివేసినారు. చూచినారా శ్రీమన్నారాయణమూర్తికికూడా దేవతాపక్షపాతంయేలాగున్నదో? మేమూ భూదేవతలం మాయందుకూడా అందరికీ అలాపక్షపాతం వుండవలెను. బ్రాహ్మణపక్షపాతికి యెప్పుడూ సర్వశ్రేయస్సులూ కలుగుచవి. బ్రాహ్మణాశీర్వాదప్రభావం వర్ణించడానికి బ్రహ్మకయినా తనచేతకాదన్నాడు.

పంత—మధ్యమధ్య మీావ్యాఖ్యానం చాలించి కథకాని స్తురూ.

సింగ—మీారు చిన్నలుగనుక బ్రాహ్మణప్రభావం తిన్నగా తెలియదని కొంచెం సూచన చేసినాను. భూసురమహత్యం పూర్ణంగా చెప్పడానికి బ్రహ్మ దేవుడి చేతనే కానప్పుడు నాతరమవుచుందా? నా తాతతరమవుచుందా? జగన్మోహినీఅవతారం ధరించిన శ్రీహరి శిరస్సు కొట్టివేసినా అమృతంతాగడంచేత వాడుచావక ఆవుక్కురోషంకడుపు లోనుంచికొనిపర్వదినాలలో సూర్యుణ్నీ చంద్రుణ్నీ మింగిసకలబాధలూ పెడుచూవుంచాడు. ఆమాలముండాకొడుకు మూలంగా ఆమహానుభావు లకు యెంత ఆపదవచ్చిందండీ? ఆలోకారాధ్యులకు మఖిలసోకినప్పుడు మనం తప్పకుండా స్నానం చెయ్యవలెను. ఆసమయంలో పట్టుస్నా నమూ విడుపుస్నానమూచేసి బ్రాహ్మలకు దానాలూ ధర్మాలూ చేస్తే ఆపుణ్యం యింతాఅంతాఅని చెప్పనలవికాదు. మహానుభావు లయినవారు దశవిధ దానాలూచేసి లక్షలకొద్ది సంభావనయిచ్చి పుణ్యం సంపాదించుకుంచాడు. ఇప్పుడు యిస్కూళ్ళల్లో చదువుకునే మోటముండాకొడుకులు జుట్టయినా తడపకుండా వస్తునకూర్చుండి స్నానాలుసేసేవాళ్ళను మీాదిమిక్కిలి వెక్కిరిస్సారయ్యా!

పంత—ఈప్రసంగాలు మాని వేసి కథ సాంగం కానిస్తురూ!

సింగ—ఇంకాయేమివున్నది? పట్టడంకారణం అంతే. గ్రహణం పట్టడంతోటే తెలుసుకుని బ్రాహ్మలు స్నానంచేసి మంత్రాలు ప్రయోగిస్తే అవివజ్రాయుధాలైతగిలి ఆపాపగ్రహం నిలవలేక హడిలి విడిచి పారిపోతుంది. ఈకర్మభూమిలో అంటే బ్రాహ్మలకు తెలిసి మంత్రాలుజపిస్తే రాహువూ కేతువూ పారిపోచారుగాని వర్ణాశ్రమ ధర్మాలులేని మ్లేచ్ఛదేశములలో సూర్యచంద్రులకు యిటు వంటి ఆపదవస్తే యెలానివారణ అవుచుందో!

పంత—ఆఫ్రికాదేశంలో సిద్దీలు గ్రహణంపట్టినప్పుడు పాము కరిచిందని పెద్దకేకలువేసి కొమ్ములుపూది డప్పులువాయించి భూమీ ఆకాశమూ కోలాహలధ్వని యిచ్చేటట్టు గందరగోళంచేసి గ్రహణం విడిచినతరువాత తమచప్పుడుకు ఝడిసి ఆపాము సూర్యుణ్నీ చంద్రుణ్నీ విడిచి పారిపోయిందని సంతోషిస్తారట!

సింగ—అది నిజమేకాబోలును. కర్మభాహ్యులమనందున వాళ్ళకు మంత్రాలు లేక ఆవిధంగా జడిపించి రాహుగ్రహాన్ని పారదోలుచారు. వాళ్లూకొంతపుణ్యాత్ములే. యెవళ్ళూ యేవిధంగాను పూనుకోకపోతే దుష్టగ్రహంవల్లమహాత్ముల కటువంటి బాధవచ్చినప్పుడు యేమిదిక్కు? ఆ వేళకు భగవంతుఁడు యెవరినో వకరిని ఆధారం చూపిస్తాడు.

పంత—చీనా దేశములోకూడా ఘోరసర్పంవచ్చిపట్టుకున్నదని భేరీలువాయించి గంటలుకొట్టి దాన్ని బెదరకొట్టడానికై పెద్దధ్వని చేస్తారట.

సింగ—ఇంకాయేమిషయ్యా! ఇప్పుడు నిజంబోధపడ్డదా? చీనావాళ్ళూఅందరూ కూడా పాముకరిస్తే గ్రహణం పడుచుందని వప్పుకుంచూవున్నారా? ఆపాము పేరే రాహువు. ఇంతమందికి ఇలా తెలుస్తూవుండఁగా యీ తెల్లవాళ్ళకు యీమూర్ఖత్వం యేమిషయ్యా? వాళ్ళ మొఖం భూమినీడయేమిషి? చంద్రుఁడు అడ్డంరావడం యేమిషి? శ్వేతముఖులకు స్వతహాగా తెలివీలేదు మావంటిబుద్ధిమంతులు చెపితే వినే నేర్పూలేదు. అయ్యో? మాటలసందడిని మరిచిపోయినాను. సంభావన మించిపోచుంది. గమళ్ళతాతయ్యగాడి యింట్లో యివాళ శోభనం. త్వరగావెళ్ళవలెను.

(అని లేచిపోవుచున్నాఁడు.)

యోగ్యాయోగ్య విచారము.

[పరాంకుశరావుగారు కూర్చుండియుండఁగా సోమేశ్వర శాస్త్రిలుగారు ప్రవేశించుచున్నారు]

పరాం—ఏమండి శాస్త్రిలగారు ప్రొద్దున్నే దయచేసినారు?

సోమే—తమతో వక్కహాంశం మనవిచేసుకుంచాను కోపం రాదుగదా?

పరాం_యేమిటో చెప్పండి.

సోమే—మీతమ్ముడు భ్రష్టయిపోవుచున్నాఁడు. మీరేమీ కనుక్కోవడంలేదుగదా? మీరు మాకు ప్రభువులు గనుక మీ శ్రేయస్సుకోరి చెప్పచాను. మీవాఁడు పోఖరీల సహవాసంకూడి పరమపోఖరీ అయిపోయినాడు. మీరుతత్క్షణంశ్రద్ధచేస్తేనే కాని నిష్కారణంగా చెడిపోచాడు.

పరా—మావాడు పోఖరీ అని యెవరూ చెప్పఁగా నే నెప్పుడూవినలేదే? వాఁడు యెప్పుడయినా ముండయింటికి వెళుతూ వుండగా మీరుచూచినారా? వాడు దీపాలు పెట్టినతరువాత చదువేమో వాడేమోకాని యెప్పుడూ గుమ్మందాటి వీధిలో అడుగు పెట్టడు. మీరు మరియెవరినిచూచి మావాడనుకొన్నారో!

సోమే—మీపాదలతోడు తప్పకుండా మీవాడేనండి. ముండలతో వెళితేనే కాని పోఖరీ కాకూడదాయేమిషి? మీభావగారి కొమారుడు ఇంట్లోడబ్బంతా తీసుకుని పోయి ముండలకు పెడుచాడు. వాడు యెంతపెద్దమనిషండీ? మీవాణ్నన్నట్టు అతగాణ్ని పోఖరీఅంటే జింహావుచ్చి పురుగులుపడవూ? అతనిబిళ్ళగోచియేమి? ప్రాతస్నానాలు యేమి? విభూతిపెండికట్లేమి? బ్రాహ్మణభక్తియేమి? అతనంత శిష్టు యీవూళ్ళో మరియెవరైనా వున్నారండీ? నేను కనఁబడితే యెప్పుడూ

దణ్ణంపెట్టకుండా వుండడు. మీరు నామాటనమ్మండి నమ్మకపోండి మీవాడు తప్పకుండా పోఖరీ. మీరు చెప్పించే మాలచదువు కొంప తీస్తూవున్నది.

పరాం—మీమాటలు నాకు తెలియడంలేదు. మావాణ్ని మీరు యేమిచూచి పోఖరీ అంటూవున్నారో స్పష్టంగా చెప్పండి.

సోమే—యేమిచూచినానా? అన్నీచూచినాను. మీవాడు మొఖాన్ని విభూతిపెట్టడు; జారుగోచీ పెడుచాడు; మొన్నబూడ్సుల జోడు తొడుక్కుని మొఖాన్న బొట్టులేకుండా పట్టపగలు వీధిలో నుంచి వెళుచూవుంటే నేను కళ్లారాచూచినాను. పోఖరీతనానికి బూటుసులు తొడుక్కోవడముకంటెనూ ఇంకా యేమి కావలెనండీ!

పరాం—మీరుచూచిందంతా ఇంతేనా మరియేమయినా వున్నదా? ఇందులో నాకు జబ్బుయేమీ కనబడడంలేదు.

సో—నేను ఇవిగాక లక్షచూచినాను. చెప్పమంటే చెపుచాను. మీవాడు బ్రాహ్మలకుదణ్ణంపెట్టడు; గుళ్లోకివెళ్లడు; ఇస్కూల్లోకివెళ్లివచ్చి బట్టలుతడిపి స్నానం చెయ్యడు సరిగదా జంధ్యాలైనా తడపడు; వరదవచ్చినప్పుడు గోదావరిలో స్నానం చెయ్యమంటే బురదనీళ్లంచాడు, గోమయం శుచికాదంచాడు. మీరు వెయ్యనండి లక్షనండి మీవాడు తప్పకుండా చెడిపోచూవున్నాడు. మీరువుపేక్ష చేస్తే బ్రాహ్మణీకం భ్రష్టయిపోచుంది. వర్ణాశ్రమధర్మాలు సమూలం నశిస్తవి.

పరాం—ఇప్పుడు నన్ను యేమిచెయ్యమంటారయ్యా?

సో—నా ఆలోచన అడుగుచూవున్నారుగనుక మీకు ఇహపర సాధనమైనటువంటిన్నీ బ్రాహ్మణీకంనిలిచేటువంటిన్నీ వర్ణాశ్రమ ధర్మాలు చెడకుండా వుండేటువంటిన్ని పరమార్థంచెపుచాను. నేను చెప్పినట్లు చేస్తానని చేతులోచెయ్యివెయ్యవలెను. ఇదంతా

మీబాగుకోసమూ మీచిన్నవాడి బాగుకోసమూకాని మరివకటి కాదుసుమండీ! నామాటనమ్మండి ముఖ్యంగామీరు నామాటయందు పూర్ణ్జితంవుంచి తక్షణంమీవాడికి మాలచదువు మానిపించి నమక చమకాలూ మంత్రపుష్పమూ చెప్పించండి. జనపాలు గొరిగివేయించు కొని ఖాయిలావచ్చినాకానీ మానకుండా ప్రొద్దున్నేస్నానంచేసి మొఖంనిండా విభూతి పెట్టుకుని బ్రాహ్మడుకనబడ్డప్పుడల్లా దణ్ణంపెడి తేనేకాని భోజనం పెట్టమనీ ఇంట్లోకైనా రానియ్యమనీ మీరుగట్టిగా చెప్పండి. మీపెద్దలు దేవబ్రాహ్మణభక్తికలవారని బహుప్రతిష్ఠ సంపాదించినారు. మీవాడిమూలంగా పూర్వులకందరికి అప్రతిష్ఠ వస్తూవున్నది.కులంబోయిన తరువాత అవతల వుద్యోగంయెందుకండీ? కులాచారధర్మం తిన్నగావుంటే తిండికి లేకపోతే ముష్టి యెత్తుకో వచ్చును. దాన్లో యేమీ లోపం లేదు.

పరా—మావాడియందు మీరు కనిపెట్టినలోపాలు ఇంతేనా మరియేమైనావున్నవా! ఈమాత్రానికి వాడిచదువు చెడకొట్టడం నాకుయిష్టంలేదు.

సోమే—మీరుకాగా ఇలాగు సంశయిస్తూన్నారుగాని గుళ్లో గోపాలస్వామివారినిరాతిబొమ్మఅన్నాడని గోపాలరావుగారితోచెపితే నామాటప్రకారం తక్షణంకొమారుణ్ని ఇంగ్లీషుబడి మానిపించి ఇంట్లోమూడుపూటలూ వేదంచెప్పిస్తూవున్నారు. మీవాడిదగ్గిర నేనుచూచింది పెద్దలోపం వకటి చెపుతాను ఇంగ్లీషు మానిపించి వేస్తారా?

పరాం—అది యేమిటోచెప్పండి.

సో—నిన్నగాక మొన్న నేను బహిర్భూమికి వెళ్లివస్తూవుండ గా యెడ్లబండి వకటి శూద్రకుర్రవాడి కాలిమీదనుంచి పోవడానికి సిద్ధమయ్యేటప్పటికి నేనువద్దని కేకలువేస్తూవున్నా నామాటలక్ష్యంచె

య్యేక మైలబడి శూద్రకుర్రవాణ్ని ముట్టుకొని ఇవతలకు తీసుకువచ్చినాడు. అలాగు శూద్రవాణ్ని ముట్టుకొని బట్టలు ఇంట్లో కలిపితే ఇంకా బ్రాహ్మణీకం మేమియేడిసింది? మాలకూడంతా కలిసిపోచూవున్నది. నేను వెనుక వకపర్యాయం వకశూద్రకుర్రవాడు చెట్టుమీదనుంచి పడి రక్తప్రవాహాలుకట్టి యేడుస్తూవుంటే బట్ట మయిలపడిపోచుందని కర్రైనా చేతికసరాయిచ్చి లేవతీసినాను కాను. ప్రాణం పోయినాకానీ వర్ణాశ్రమ ధర్మాలు ఆప్రకారంగా నడపవలెను.

పరాం—మావాడు చేసినపని నాకు సంతోషంగానే వున్నది కాని కోపపడడానికి యిందులో నాకు హేతువేమీ కనబడడంలేదు.

సోమే—ఇంగ్లీషుచదువువచ్చి వర్ణసంకరమై పోచూవున్నది. మీరుఇంగ్లీషుచదివినవారె. సంగతి తెలిసివుండిన్నీ మీతో ఇలా గంటివి చెప్పడం నాదే బుద్ధితక్కువ. కలౌ పంచసహస్రాణి జాయతే వర్ణసంకరః అన్నాడు. ఇఖ తప్పదు. వర్ణసంకరం కావడానికి బ్రాహ్మణజన్మంయెత్తినవాడు శూద్రవాణ్ని ముట్టుకోవడం కంటె ఇంకా యేమికావలెను? నేను చెప్పినమాటలు మీకు యేమిరుచించడంలేదు. ఇదంతా కలికాలమహాత్యం.

పరాం—శాస్త్రుల్లగారూ! కోపంచెయ్యకండి. మావాడిదగ్గరనిజమయినతప్పిదం యేమయినావుంటే శలవివ్వండి శిక్షిస్తాను.

సోమే—అలాగైతే చెపుతాను శిక్షించండి. మొన్న యీమధ్య వకజటాంత స్వాధ్యాయి అయినబ్రాహ్మణుడు డబ్బుకు అవసరంవచ్చి మీవాడు చదువుకుంచూ వున్నవారి ఇంట్లోవున్న వస్తువొకటి వారితో చెప్పకుండా తీసుకువచ్చి తాకట్టుపెట్టుకుంటే మీవాడు సాక్ష్యంపలికి శిక్షవేయించినాడు. అది దొంగతనమష! గొప్పతప్పిదమష! బ్రాహ్మణవిషయంలో అబద్ధమాడితే బహుపుణ్యం వస్తుందని యెంతమందిచెప్పినా వినక కచేరిలో నిజంచెప్పివేసినాడు. ఆబ్రాహ్మడు

మీవాడిమూలంగా జయిలులో యెంతక్షోభపడ్డాడు. ఆబ్రాహ్మడి వుసురంతా మీవాణ్ని చుట్టుకొని రౌరవాది నరకాలలో పడిపోడూ? బ్రాహ్మణ్ని యేడిపిస్తే బాగుపడచాడండీ? పూర్వము మనరాజులు ధర్మపరిపాలనం చేసేకాలంలో బ్రాహ్మణు యెంతతప్పిదంచేసినా పూజించేవారుగాని శిక్షించేవారుకారు. ఇప్పుడంతాకలిమయం అయిపోయింది. వాడు యెలాగంటి బ్రాహ్మణ్ణో కాని ఆశిక్ష వేసిన అధికారీ బ్రాహ్మడేనట! కులాభిమానంలేకపోయిన తరువాత వాడు బ్రాహ్మడు కాడు పరమఛండాలుడు.

పరాం—తప్పిదం చేసినవాడికి శిక్ష వేస్తే దూషించడం న్యాయంకాదు.

సోమే—ఆగండి. మీకుకూడా ఆలాగే తోచినతరువాత ఇఖ మీతో మాటాడడం భావ్యంకాదు. వెళ్లిపోతాను.

(అని వెళ్ళుచున్నాఁడు)

వర్షము.

[గణపతిరావు కూరుచుండి చదువుకొనుచుండఁగా శంకరశాస్త్రిగారు ప్రవేశించుచున్నారు]

గణ—శాస్త్రుల్లుగారు! నమస్కారమండి.

శంక—దీర్ఘాష్యమస్తు! వంశాభివృద్ధిరస్తు! రాజద్వారే రాజభవనే సర్వదా దిగ్విజయమస్తు!

గణ—అప్పుడే ఆశీర్వచనమంతా అయిపోయిందండీ? ఇఖ మీకు మరేమీరావండీ?

శంక—ఈయింగ్లీషుచదువుకునేవాళ్లకు మమ్మల్ని చూస్తే వేళాకోళంగావుంచుంది.

గణ—వేళాకోళం కాదండీ మీరు తాతగారవుతారుగనుక హాస్యాని కన్నాను. కోపం వుంచకండి.

శంక—చిన్నవాడవు నీహాకమాటఅన్నా కానీ నాకు కోపం లేదు. నాయనా! నీవు చదువుకునే పుస్తకంపేరు యేమంచారు?

గణ—దీనిపేరు "ఫిజికల్ జాగ్రఫీ" అంటారు.

శంక—అందులో యేమివుంచవి?

గణ—అందులోనా? భూమినిగురించీ వాయువునుగురించీ సముద్రాన్నిగురించీ అనేక సంగతులు వుంటవి.

శంక—నీవు యిప్పుడు చదివేభాగం దేన్నిగురించి?

గణ—వర్షానిగురించీ మేఘాల్నిగురించీ చదువుతూవున్నాను. అదిమాకు యివాళ పాఠం.

శంక—వర్షం యెందుకువస్తుందని చెప్పుతాడు? ఇంగ్లీషుపుస్తకాలప్రకారం మేఘం అంటే యేమిషి?

గణ—సూర్యకిరణముల వేడిమిచేత సముద్రములోనూ నదుల లోనూ మడుగులలోనూ వుండేనీరు ఆవిరిరూపంగా పయికిలేచి వక చోట కూడుకొని పైనిగాలిలో మేఘంగా యేర్పడి బరువు యెక్కువయి నప్పుడు నీరు కిందపడుతుంది. దాన్నే వర్షమంటారు.

శంక—అంతేకాని మేఘాలకు ప్రాణంవుండడమూ ఇంద్రుడికి వాహనాలు కావడమూ అంతా అబద్ధమే అంచారా?

గణ—నిస్సందేహంగా అబద్ధమే. మేఘాలకుయేమిటి? ప్రాణం వుండడంయేమిటి? వాటిలో పొగా ఆవిరీ గాలితప్ప మరియేమీ వుండదు.

శంక—నీవుచెప్పినది యెంతమాత్రమూ నమ్మతగివుండలేదు. మేఘాలకుతప్పకుండా ప్రాణం వుచుంది. పూర్వం యక్షుడి పెళ్లాం దగ్గిరకు రాయభారంకూడా పట్టుకు వెళ్లినవి. మేఘాలు సముద్రంలోకి

వెళ్ళి నీళ్ళుతాగుచూవుండగా అనేకులు చూచినారు. అలా నీళ్ళు తాగివచ్చి అల్పాచమానంచేస్తే ఆనీరువర్షరూపంగా భూమిమీద పడుచుంది. అందుచేతనే వర్షపునీరుకు భూమిమీద పడితేనేకాని శుద్ధిలేదు.

గణ—మేఘాలు సముద్రంలోకివెళ్ళి నీళ్ళుతాగుతూవుండగా మీ రెప్పుడైనా చూచినారా? పామరులు చెప్పవలసినమాట పండితులైవుండిన్నీ మీరుకూడా విశ్వసిస్తారేమి? మేఘము లేమిటి? నీళ్లు తాగడంయేమిటి?

శంక—అయ్యయ్యో! నామాటనమ్మకపోతే నేను యేమి చెప్పను? మేఘములువచ్చి సముద్రములోనే కాకుండా దాహంవేసినప్పుడు కోయవాళ్లకుండలలో కూడా కొండలమీదికివచ్చి నీళ్ళు తాగిపోచవి. కోయవాళ్లు పొంచివుండి నీళ్ళుతాగడానికి కుండలలో దూరి నీళ్ళు కతుకుతూవున్నప్పుడు చటుక్కున మూతవేసి కుండకింద మంటపెట్టి మేఘాలను వండుకునితించారు. ఈసంగతి మా మేనమామచూచినాడు.

గణ—ఆయనను అడిగితే ఆయనకూడా తనమేనమామ చూచినాడని చెప్పుతాడు. ఈలాగంటిపిచ్చి కథలన్నీ అంధపరంపరగా వ్యాపించి మూఢులు నమ్ముతారు. యెవరూ యేమీ చూచినవారుండరు. కోయవాళ్ళమాటయెందుకు? మీరు యెవరూ యింట్లో లేనప్పుడు మీబిందెలలో మంచినీళ్లు మాయింట్లో పోసుకుని ఆనీళ్ళు మేఘములు తాగిపోయినవనీ మామేనమామచూచినాడనీ మాదొడ్లో వాళ్ళు మేఘాన్ని వండుకు తిన్నారనీ నేను చెపితే మీరునమ్ముతారా?

శంక—మీరు లక్ష చెప్పండి. వెయ్యిచెప్పండి. మేఘాలు జంతువులుకావడానికి సందేహంలేదు. యెండకాకచేత నీళ్ళు పయికి వెళ్ళి కింద పడుతూ వుండడమే వర్షమయితే రోజూ వర్షంకురుస్తూనే

వుండును. మేఘాలకు యజమానులు వున్నారు. వాళ్ళ సెలవైతేకాని అవి వర్షం కురియవు.

గణ—మీరు చెప్పినప్రకారం అల్పాచమానం చెయ్యడానికి కూడా యజమానుల శెలవుకావలెనా యేమిటి? అలాగయితే మహా గొప్ప యజమానులు దొరికినారు.

శంక—నేనూ అనేకశాస్త్రిలు చదివినముండాకొడుకును. నామాటబొత్తిగా తీసివెయ్యకండి. కావలిస్తే మీకు కావలసినన్ని శాస్త్రప్రమాణాలు కనపరుస్తాను. మేఘాలకు వరుణదేవుడూ ఇంద్రుడూ యిద్దరు యజమానులు. వారిసెలవైతేనేకాని వర్షంకురియదు. అందుచేతనే కొన్ని దేశాలలో వర్షంకురియక క్షామంపడుచుంది. పూర్వం ద్వాదశవర్షక్షామాలు యెందుకువచ్చేవి?

గణ—జనుల తెలివితక్కువచేత వచ్చేవి. ఆనకట్టలుకట్టి కాలవలు త్రవ్వించి దేశమంతా నీరు ప్రవహించేటట్లుచేస్తే ద్వాదశవర్షక్షామాలూ గీమాలూకూడా హడిలి పారిపోతవి. ఇప్పుడీ కాలవలు త్రవ్వించినతరువాత ద్వాదశ వర్షక్షామాలు యెప్పుడైనా రాగా మీరు చూచినారా?

శంక—అబ్బాయీ! చిన్నవాడవు నీకేమీ తెలియదు. పూర్వకాలపువారిని పెద్దలను అలా తిరస్కరించరాదు. వారు సర్వజ్ఞులు యేమీ లేకపోతే వారు నిష్కారణంగా దేవతలున్నారని చెప్పరు. వర్షాలులేనప్పుడు వారు వరుణమంత్రాలు చదివి వక్కనిమిషంలో వర్షాలు కురిపించేవారు. దేవత లందరూ వారికి ప్రత్యక్షం. వర్షాలు లేనప్పుడు జనులందరూ వెళ్ళి బ్రాహ్మలకాళ్ళు పట్టుకుని వారిని సంతోషపరిస్తే తమ మంత్రశక్తిచేత వర్షంకురిపించి లోకానికంతటికీ సంతోషం కలుగచేసేవారు. బ్రాహ్మల వద్ద అలాగంటిమహాత్యము వున్నదిగనుకనే అందరూ వారిని భూదేవతలని పూజచేస్తారు.

గణ—అదంతా బ్రాహ్మలు తమఆధిక్యం నిలవడానికి పన్నిన పన్నుగడ. ఆదేవతలు బ్రాహ్మలకు యెంతప్రత్యక్షమో శూద్రులకూ అంతేప్రత్యక్షము. బ్రాహ్మలు కోరితే వర్షంకురిసేటట్టయితే శూద్రులుకోరినా వర్షంకురుస్తుంది.

శంక—అబ్బాయీ! బ్రాహ్మణదూషణ నీకు శ్రేయస్కరం కాదు. బ్రాహ్మలయందు తప్పకుండా గొప్ప మహాత్యం వున్నది. ఇప్పుడుకూడా బ్రాహ్మలకు డబ్బు యిచ్చి వారిచేత వరుణమంత్రాలు చదివించి సహస్రఘటాభిషేకాలు చేయిస్తే యెలా వర్షాలు కురుస్తవో చూచినావా? నిరుడుసంవత్సరము పెన్నేటిగ్రామంలో కాపులంతా పోగయి నూరురూపాయలు చందాలువేసుకొని బ్రాహ్మలచేత సహస్రఘటాభిషేకం చేయిస్తే అదివరకు వక్క చుక్క పడనిది మూడు రోజుల కల్లా వర్షంకురిసింది.

గణ—ఇదంతా బ్రాహ్మలు జనులను తెలివితక్కువవాళ్ళను చేసి వాళ్ళడబ్బు కడతేర్చడానికి పన్నినయంత్రంకాని అంతకంటె వేరేయేమీలేదు. ఆవెయ్యికుండలనీళ్ళూ గుళ్ళోపోయించడంకంటె తమపొలాలలో పోయించుకుంటే పొలాలలో కొంతభాగమయినా తడిసిపోను. అనూరురూపాయలూఖర్చుపెడితే శుభ్రంగా వక మోటనుయ్యి వచ్చును. అనూరురూపాయలూ కూలివాళ్ళకు యిచ్చి నీళ్లు తోడించి పోయించినా బహుభాగా పొలాలుపండేవి. మూఢులుగనుక వాళ్లనిష్కారణంగా నూరురూపాయలు బ్రాహ్మలపొట్ట పెట్టి పాడు చేసినారు. నిరుటిసంవత్సరం మనవూళ్ళో సహస్రఘటాభిషేకంచేస్తే పయినుంచి వక్కచుక్క నీరుపడ్డదికాదు. వీధులుమాత్రం రొచ్చుపడి పదిరోజులు నడవడానికి వల్లఅయిందికాదు.

శంక—మంత్రప్రభావం కాకపోతే రెండోవూళ్ళోకురవడానికి కారణంయేమిటి? నాకుతోచక అడుగుచాను చెప్పండి.

గణ—మంత్రప్రభావం అయితే యీవూళ్ళో కురవకపోవ డానికి కారణం యేమిటో మీరుచెప్పండి చూతాము. ఈసహస్ర ఘటాభిషేకాలు వేసవికాలంలో వర్షాలుకురిసేముందు చేస్తారు. వాటంతట అవి వర్షాలుకురిస్తే బ్రాహ్మలు అవి తమమహాత్వం వల్లనే అంటారు. కురియకపోతే కన్నంలోదొంగను తేలుకుట్టినట్లు మాట్లా డక వూరుకుంటారు. తరువాత వర్షాలుకురిసినా కురియకపోయినా ముందుగా బ్రాహ్మలకు సంభావనలూ సంతర్పణలూ తప్పవు. ఇది అంతా పట్టపగలు అందరూ మేలుకుండఁగా చేసేమోసము.

శంక—అబ్బాయీ! యీప్రసంగం ఇఖచాలించు. అంత కంతకు బ్రాహ్మణదూషణ యెక్కువ అవుచూవున్నది. బ్రహ్మ ద్వేషం ముదిరినతరువాత ఇఖవాడితో మాట్లాడరాదు. ఇప్పుడు ఇంగ్లీషుచదువువచ్చి యీమాలచదువు మూలంగా శాస్త్రిలూ ఆచారాలూ మన్నుకొట్టుకొని అంతా భ్రష్టయిపోచూవున్నది. ఇంగ్లీషు చదువుకున్న వాళ్లు వట్టికిరస్తానీముండావాళ్ళు అన్నింటికీ కుశ్శంకలుచేసి లోకమంతా మాలకూడుచేసి పాడుచేస్తూవున్నారు. రామరామ రామరామా! ఇఖయీమాటలు వింటే పాపంవస్తుంది.

(అని చెవులుమూసికొని లేచిపోవుచున్నాఁడు)

హిందూమహాజనుల మతసభ.

[శైవులు, వైష్ణవులు, మాధ్వులు, స్మార్తులు మొదలైన హిందూ బ్రాహ్మణ మహాజనులు సభ చేరియుండఁగా లౌకిక వ్యవహార ములోనున్న యొక శాస్త్రిలవారు ప్రసంగించుచున్నారు]

శా—ఇంతమంది యిన్ని తెగలవారు వక్కచోట యీప్రకా రంగా సమావేశం కావడంచూస్తే హిందువులలోవుండే ఐకమత్య

ము మరియెవరిలోనూ కూడాలేనట్టు స్పష్టమవుతూవున్నది. ఇటువంటి ఐకమత్యం మనలో వున్నదిగనుక మధ్య మధ్య యెన్నిఅవాంతరాలువచ్చినా ప్రభుత్వాలు యెన్నిమారినా మనవేదచోదితమయిన మతం యెన్నిమ్లేచ్ఛమతాలవారు పాడుచెయ్యడానికి ప్రయత్నము చేసినప్పటికిన్నీ మేరుపర్వతమువలె సుస్థిరంగావుండి ఎంతమాత్రం చెడకుండా నేటివరకూ అవిచ్ఛిన్నంగా సాగుతూవున్నది. అయితే యిప్పుడు ఫాదరీలవల్లనూ కిరస్తానీ మతబోధవల్లనూ మిషనరీస్కూళ్ళల్లోచెప్పే మాలచదువువల్లనూ మనమతం పాతుకదిలేస్థితివచ్చేటట్టు కనబడుతూవున్నది. ఇప్పుడుమనం వెంటనే జాగ్రతపడి పునాది బలపరిస్తేనేకాని అంతాచెడిపోతుంది. ఇదివరకు యెక్కడనో యెవరో కిరస్తానిమతంలో కలిసినారని చెప్పుకోవడమేకాని ఇప్పుడా గ్రహచారం ప్రత్యక్షంగా మనకే సంభవించినది. వారముదినముల లోపుగా యెప్పుడూలేనిది మనవూళ్ళో వొక వైష్ణవు చిన్నవాడున్ను వైదికపు చిన్నవాడున్నూకూడా కిరస్తానీ మతంలో కలిసిపోయినారు. ఈవారమురోజులనుంచీ వూరంతా అల్లకల్లోలంగా వున్నది. ఇప్పుడు మనం ఇక్కడసభచేసినది ముందు మనం చెయ్యవలసినపనియేమిటో ఆలోచించడానికయి వున్నది. గనుక బుద్ధిమంతులు వారివారికి తోచినదాన్ని చెపుతారనికోరుతాను. రామచంద్రరావుపంతులుగారు లౌక్యమందూనైదికమందుకూడా నిధులు వారు మొదటచెపితే బాగావుంటుంది.

రామా—మనమతం మనకుర్రవాళ్ళకు బాగా తెలియక పోవడంచేత వాళ్ళు అన్యమతంలో ప్రవేశించడం తటస్థమవుతూ వున్నది. మనం దేవాలయాలలోనో మరియే బహిరంగస్థలములోనో వారానికి రెండుసార్లు పిల్లలందరూ పోగయ్యేటట్టుచేసి కొంతమంది

పండితులచేత వాళ్ళకు మనమతం బోధచేయిస్తూ వుండవలెను. నేను చెప్పినది బాగావున్నదా?

మహాజనులు—బహుబాగావున్నది. తప్పకుండా రేపటినుంచీ అలాగు చెయ్యవలసిన దే అయితే యీమతబోధ యే దేవాలయంలో చేస్తే బాగావుంటుంది? పండితుల్ని యెవరిని పెడుదాము?

వ్యాసరాయాచార్యులు—ఈ వేదశాస్త్రపాఠశాల ఆంజనేయ స్వామివారి కోవెలలో పెట్టి ముఖ్యప్రాణాచార్యులుగారినిపండితుల్నిగా యేర్పరిస్తే బాగావుంటుంది.

రామానుజాచార్యులు—కాదు. కాదు. శ్రీకేశవస్వామివారి ఆలయంలో తిరుమంటపంమీద పాఠశాలపెట్టించి శ్రీవేదాంత దేశికాచార్యులవారిని పండితులనుగా నియమిస్తే బహుదివ్యంగా వుంటుంది.

బసవయ్యఅయ్యవార్లు—శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిగుళ్లో పాఠశాల వుంపించి వీరభద్రయ్యవార్లంగారిని పండితులనుగా పెడితే మరీబాగావుంటుంది.

రామా—ఆగుళ్లో పెడితే మాపిల్లలను మేముపంపము.

బస—మీగుళ్లో పెడితే మాపిల్లలను మేమంతకుమునుపే పంపము.

పరబ్రహ్మసోమయాజులు—మాకు శివకేశవులు యిద్దరూ సమానమే. పాఠశాల వకరోజు శివాలయంలోనూ వకరోజు విష్ణాలయంలోనూవుంచి హరిశాస్త్రుల వారిని పండితులనుగా పెట్టండి. యెవరికీ యిబ్బందిలేకుండా వుంటుంది.

రామా—స్మార్తపండితుణ్ని వేస్తేమాకు పనికిరాదు.

వ్యాస—మాకంతకుమునుపే పనికిరాదు.

బస—మాకుబొత్తిగానే పనికిరాదు.

రామా—మాకు వైష్ణవపండితుఁడే వుండవలెను.

వ్యాస—మాకుమార్ధ్వపండితుఁడే వుండవలెను.

బస—మాకు శైవపండితుఁడే వుండవలెను.

వెంకట్రావుపంతులు—మీరూ మీరూ యేమీ లేనిదే ముందుగానే యెందుకు దెబ్బలాడుతారు? వకస్మార్తపండితుణ్నీ, వకవైష్ణవపండితుణ్నీ, వకలింగధారి పండితుణ్నీ, వక మార్ధ్వపండితుణ్నీ వేసి అన్నిమతాలూకూడా చెప్పింతాము. మీలోమీరు తగువులాడకండి. స్థలవిషయమయి యేమీ తగాదారాకుండా దేవాలయాలలో మాని వేసి పాఠశాల కొత్వాలుసావిట్లో పెట్టింతాము. ఇక మతవిషయంలో, యేమి ముందుగా చెప్పవలెనో ఆలోచించండి.

రామా—ఆలోచించేది యేమిటి? ముందుగా మనదేవుడు యెలాగంటివాడో పిల్లవాళ్ళకు బోధించవలెను. ప్రతిరోజూ శ్రీస్వామివారి కోవెలలోకి బాలకులు తప్పకుండా వెళ్ళేటట్టుచేసి మనంచేసే బోధకున్నూ వాళ్ళుచూచే దివ్యమంగళవిగ్రహానికిన్ని సరిపడేటట్టుగా దేవుడు చతుర్భుజుడనిన్నీ లక్ష్మీసమేతుడనిన్నీ శంఖచక్రవిరాజితుడనిన్నీ ముఖమునందు తిరుచూర్ణనామ—

రంగాచార్యులు—మీరుచెప్పేదాన్లో చివరస్పష్టంగా లేదు. నామంసంగతిని గురించి చెప్పేటప్పుడు ముక్కుమీద కిందపాదంవుండవలెనో లేదో ఆసంగతి యీసభవారి ముందరనే స్పష్టంగా పరిష్కరించండి.

రామా—ముక్కుమీఁద పాదం తప్పకుండా వుండవలెను.

రంగా—ముక్కుమీఁద పాదం సుతరామూ పనికిరాదు. పాదంవుంటే వాడిమొఖమే చూడకూడదు.

రామా—పాదంలేకపోతే తక్కినవెన్నివున్నా యేమిప్రయోజనం లేదు. ఏమండీ ఆచార్లవారందరూ మామాట చొరకుండా అలా చెవులువేస్తారు?

రంగా—మీవాళ్ళు కేకలువేస్తే మావాళ్లుమాత్రం వూరుకుంటారా? ఇందులోమాత్రం అంత పౌరుషంచచ్చినవారు యెవరు?

వెంక—మీవడఘులి తెంఘులి ఖజ్జాలు కాలిపోను ఇక్కడ దొమ్ములాటకండయ్యా.

బస—వారితగాదామాట అవతలవుంచి ముందుగా మేము చెప్పేది వినవలెను. రామానుజాచార్లు చెప్పేదానికి మేమసలేవప్పుకోము. దేవుడు త్రినేత్రుడనిన్నీ పార్వతీ సమేతుడనిన్నీ త్రిశూలఖట్వాంగవిరాజితుడనిన్నీ విభూతిధారిఅనిన్నీ బోధించవలెను.

రామా—ఆలాచెపితే పాఠశాల సాగనేసాగదు. విభూతి రుద్రాక్షలు ధరించి లింగం కట్టుకున్నవాణ్ని చూస్తే సచేలస్నానం చేసి చాంద్రాయణవ్రతం చెయ్యవలెను.

బస—తిరుమణి తులసిపూసలు ధరించి చక్రాంకితాలయినవాణ్నిచూస్తే భూప్రదక్షిణం చేసివచ్చి పాపంపోవడానికి వందమంది మహేశ్వరులకు భోజనం పెట్టవలెను.

వ్యాస—చక్రాంకితాలమాట యెత్తితే మీకూ మాకూ బాగాజరగదు. జాగ్రత్త దేవుడి ముఖానికి అంగారంపెట్టి పంచముద్రలూ వుంచవలెను.

పర—దేవుడికి యేచిహ్నాలూవద్దు. స్మార్తాచారాలు తెలిసి నిత్యమూ పిల్లవాళ్ళు స్నానసంధ్యాద్యనుష్ఠానాలు చేయ్యడానికి శ్రుతిస్మృతులూ వాటి భాష్యాలూచెప్పించి జీవేశ్వరులకు భేదంలేదన్న అద్వైతసిద్ధాంతం బోధిస్తే సరిపోతుంది.

వ్యాస—అద్వైతసిద్ధాంతం మాలోయెవరికీ పనికిరాదు. స్మార్తుల మొఖంచూస్తే సచేలస్నానం చెయ్యవలెను.

రామా—స్మార్తుల మొఖంచూస్తే చాంద్రాయణం చెయ్యవలెను.

బస—స్మార్తుల ముఖంచూస్తే భూప్రదక్షిణం చెయ్యవలెను.

వెంక—మీరు నిష్కారణంగా స్మార్తులను యెందుకు దూషిస్తారు? మనంవచ్చిన పనిచూచుకోవలెను. ఈప్రకారంగా మీరందరూ దొమ్మిగా మాట్లాడక మీలో పెద్దలు యెవరో వారిని మాట్లాడమనండి.

రామా—మాలో ఆమూలకూరుచున్న గండభేరుండాచార్యులవారు భాగవతాగ్రేసరులు.

వెంక—వారు ముఖానికి విసనకర్ర అడ్డం పెట్టుకున్నారేమి?

రామా—వారుస్మార్తుల ముఖమున్ను శైవుల ముఖమున్ను చూడరు. అందుకోసం అడ్డంపెట్టుకున్నారు.

బస—మాలో చిక్కయ్య అయ్యవార్లంగారు కేవలమూ ప్రమథగణాలలోనివారు. యీసభకు వైష్ణవులు వస్తారని వారు ఇక్కడకు విజయం చేయలేదు.

రంగా—యేడవలేకపోయినాడు.

బస—మీఆచార్లు మొత్తుకోలేక పోయినాడు.

రంగా—మీశైవులు శక్తిపూజపేరుపెట్టి తాగుతారు.

బస—మీవైష్ణవులు రామానుజకూటమని పేరుపెట్టి తాగడమే కాకుండా మాంసంకూడా తింటారు.

రంగా—(లేచి) ఆరి గాడిదెకొడుకా! మావైష్ణవులను దూషిస్తావురా?

బస—(లేచి) ఆరి లంజెకొడుకా! మాశైవులనుదూషిస్తావురా!

రంగా—వైష్ణవమతమందు అభిమానం వున్నవాళ్ళంతా లెండి యెవరు గెలుస్తారో చూతాము.

బస—శైవమతమందభిమానమున్న వాళ్ళంతా నడుంకట్టుకు నిలుచోండి. యెవరుగెలిచేదీ కనబడుతుంది.

పర—హరిశాస్త్రుల్లుగారు మాలో బ్రహ్మణ్యులు.

వెంక—వూరుకోవయ్యా! బ్రహ్మణ్యులూ లేదు గిహ్మణ్యులూ లేదు. వూరుకోకుంటేయిప్పుడు మేజస్ట్రీటుజరుగుతుంది. ఆచార్లుగారూ! మీరు యింటికి వెళ్ళండి. అయ్యవార్లంగారూ! మీరింటికి విజయం చెయ్యండి. ఈసారి చాలించి మరివకసారి మళ్ళీసభ చేతాము.

(అని బతిమాలుకొని అందరినీ యిళ్లకు పంపివేస్తున్నారు)

శకునములు

[పాపయ్యపంతులవారును, కామయ్యశాస్త్రిలవారును ప్రవేశించుచున్నారు]

కామ—పాపయ్యపంతులుగారూ! మీకు గొప్ప ఆపదసంభవించినది. ఈదొరవట్టి కిరాతుకు. నూరురూపాయలపని నిష్కారణంగా పోయింది. జాతివాడిస్వభావం యెరిగినవారు మీరు రెండు దినాలు ముందుగానే బయలుదేరక పోయినారండీ?

పాప—ఆడవాళ్లను తీసుకొని మంచీచెడ్డా విచారించకుండా దూరభారం యెలాగు బయలుదేరనండీ? అమావాస్యకుముందే బయలుదేరుదామంటే దోవలో అమావాస్యవస్తే మంచిదికాదని పెద్దలు చెప్పినారు.

కామ—అమావాస్యవెళ్లిన విదియనాడు బయలుదేరినా రెండురోజులు ముందుగానే వస్తురు.

పాప—అమావాస్యవెళ్ళిన పాడ్యమి ప్రయాణానికి బొత్తిగానే మంచిదికాదు. విదియనాడు బయలుదేరుదామంటే ఆరోజు శుక్రవారమయినది. అక్కడికీ మొండిచొరవచేసి బయలుదేరుదా

మని ఆలోచిస్తూవుంటే తుసుక్కుమని లోపలయెవరో తుమ్మినారు. అటువంటి అపశకునమయిన తరువాత యేది యేమయినా ప్రయాణం చెయ్యకూడదని నాటికి మానివేసినాను.

కామ— పోనీ తదియనాడు తెల్లవారుగట్ట బయలుదేరక పోయినారా?

పాప—అన్నీ యెరిగినివారు మీరూ అలాగే సెలవిస్తారేమి? పిల్లలను తీసుకొని శనివారంవుదయాన్న దుర్ముహూర్తంపూట యెలా బయలుదేరను? ఆమధ్యాహ్నం వర్జ్యంవచ్చినది. వర్జ్యంవెళ్ళిన తరువాత రాత్రి ప్రయాణంనిమిత్తమయి బండికోసం వర్తమానం పంపించపోతూవుంటే గుడ్లగూబకూసింది. అందుకోసం ప్రయాణము మానినాను. ఆమరునాడు చవితి ప్రయాణానికి మంచిదికాదని మీరెరింగినదేకదా?

కామ—మీరు పంచమినాడు వుదయాన్న బయలుదేరినారు కాబోలును. అలాగయినా యిక్కడకు మూడురోజుల కిందనే రావలసినదే.

పాప—ఆరోజునా బయలుదేరలేదు. ఆరోజు వుదయాన్న నక్షత్రం మంచిదయినదికాదు. అదికాకుండా వర్జ్యంకూడా వచ్చినది. మధ్యాహ్నం బయలుదేరుదామంటే భోజనంచేసి పచారుచేస్తూ వుండగా మాలబల్లి మీదపడితే జ్యోతిష్కుణ్ణి పిలిపించి స్నానంచేసి దీపంపెట్టుకొని శాంతీగింతీ చేసుకునేటప్పటికి దీపాలవేళయింది. రాత్రిభోజనాలుచేసి బయలుదేరుదామంటే పెద్దలందరూ చుక్కయెదురు వెళ్ళకూడదన్నారు.

కామ—మరునాడు షష్ఠిగనుక ఆరోజునా బయలుదేరలేదనుకుంటాను.

పాప—వక్క షష్టిమాత్రం అయితే యెలాగయినా బయలు దేరుదును. ఆవేళ పిడుగువలె మంగళవారంకూడా వచ్చినది. ఈరెంటికీతోడు ఆదినం వట్టిపాడు నక్షత్రం.

కామ—ఇఖస ప్తమినాడు బయలుదేరినారు. అక్కడికీ బండి బాగానడిచినది. మీరునిన్న భోజనానికే ఇక్కడకు దయచేసినారు.

పాప—సప్తమీ బుధవారం ప్రయాణానికి బహు అనుకూల మయినదినం అయినప్పటికీ ఆదినం వుదయం బయలు దేరడానికి సందర్భ పడ్డదికాదు. అప్పుడు నిర్గమనం మాత్రం వుంచినాము. ఆదినం మాచిన్న కుఱ్ఱవాడు పుట్టినదినం. ఆదినం పండుగచేసుకుని భోజనాలుచేసి బయలు దేరితేకాని వల్లకాదని ఆడవాళ్ళు పట్టుపట్టినారు. ఆవుదయాన్నే బయలు దేరితే దొంగలమఱ్ఱి మధ్యాహ్నమే దాటి పోదుము. భోజనాలు కాగానే బయలు దేరుదామని బళ్ళుకట్టించి తీరా యెక్కబోయే టప్పటికి వెధవముండ యెదురుగుండావచ్చి మళ్ళీ లోపలికిపోయి అరఘంటసేపు ఆగినాము. అప్పుడు బయలు దేరినా దీపాలు పెట్టకముందే దొంగలమఱ్ఱి దాటుదుము. వాళ్ళీ వీధిగుమ్మంలోకి వచ్చేటప్పటికి వంటబ్రాహ్మడు యెదురుగుండా వచ్చినాడు. అందుచేత మళ్ళీలోపలకువెళ్ళి కొంతసేపు ఆగినాము. ఇఖ ఇలాగు చేస్తూవుంటే కార్యములేదని వీధులో యెవడూ నడవకుండా జాగ్రతపెట్టి పొరుగిండ్లలోనుంచి వకము త్తయిదువ యెదురుగుండా వచ్చేటట్లు బందోబస్తుచేసి చటుక్కున బండియెక్కి బయలు దేరినాము. యెంతమంచి శకునంచూచి బయలు దేరినా ఆ వెధవ ముండ ఎదురుగావచ్చినవేళ ఎటువంటిదోకాని మా అనుభవంమాకు వెంటనే అయింది. రాత్రి పదిఘంటలకు మేము దొంగలమఱ్ఱి వద్దకు జడుస్తూనే వచ్చినాము. మేము ఝడిసినట్టుగానే ఎట్లా గ్రహించినారో కాని దొంగలు సమయానికివచ్చి నగలన్నీ ఎత్తుకొని

పోయినారు. మేము మంచిశకునం చూచుకుని బయలుదేరడం చేత ప్రాణాలకు మాత్రం అపాయం లేకుండా బ్రతికి బయలపడ్డాము.

కామ—దానిముండామోసినసొమ్ము మీరుసొమ్ము కేమీ విచారపడవలసిన పనిలేదు. ప్రాణాలుబాగుంటే సొమ్ము మరివక నాటికి గణించుకోవచ్చును. శలవుదినాలు అతిక్రమించివచ్చినారని దొరముండాకొడుకు అక్రమంగా పనితీసివెయ్యడంచేత ఎల్లకాలమూ జరిగే జీవనానికి భంగంవచ్చినదని నాకు బహువిచారంగావున్నది. ఇదంతా అనుభవించే వాళ్ళము మాదురదృష్టముగాని తమకేమి మహారాజులే. ఇదివరకు గడించుకున్న వానితోనే జీవనంచేస్తారు.

పాప—నాకుయేలినాటిశని వున్నదని జ్యోతిష్కులు చెపుతూ వచ్చినారు. ఇది దానిఫలం. మొన్న నేనుజాతకం చూపిస్తే మా వూళ్ళో జ్యోతిష్కుడు మీకు సంవత్సరంలో ధననష్టంవస్తుందని చెప్పినాడు. అదంతా దాఖలా యిస్తూవున్నది. ఇకముందు జరగవలసిన సంగతి ఆలోచించవలెను. అడుగో మాఅబ్బాయీ స్కూలులోనుంచి వచ్చినాడు. వాడు శకునాలూ గిభునాలూ లక్ష్యం చెయ్యక బయలు దేరుమని నాతో చెడపోరినాడు.

[సుబ్బారావు ప్రవేశించుచున్నాడు]

కామ—చిన్నవాడు. ఈసగంతులన్నీ ఆయనకేమి తెలుసునండీ? అందులోనూ యిస్కూళ్ళల్లో చదువుకునేవాళ్ళకు బొత్తిగా దేవుడూ దెయ్యమూ వారమూవర్జ్యమూ యేమీ అక్కరలేదండి. వాళ్ళకూ కాలంవచ్చి సంసారం మీదపడితే అప్పుడు అన్నీ తెలుస్తవి.

సుబ్బా—ఇక మాకుయెన్ని సంసారాలు మీదపడ్డా ఇప్పుడు తెలిసినదానికంటె యీవిషయంలో యెక్కువగా తెలియదు.

పాప—కుర్రవాడు వాడితోనేమిగాని ముందుచెయ్యవలసిన పని యేమిటో బాగాఆలోచించి సెలవియ్యండి.

కామ—చెయ్యవలసినపని యేమున్నది? శనిచాలడుగనుక మీరు నవగ్రహజపంచేయించి బ్రాహ్మణులచేత గ్రహశాంతి చేయించవలెను. దాని నిమిత్తమయి దశవిధ దానాలూ హోమాలూ చేయించవలసివుంటవి. అటుతరువాత మీశక్తికొలది రెండు వందలకో మూడువందలకో బ్రాహ్మలకు సంతర్పణచేసిమీకు తోచినమాత్రం సంభావన యివ్వవచ్చును.

సుబ్బా—నాన్నగారూ! మీరు ఇఖ యిలాగంటి పాడుఖర్చు యేమీచెయ్యకండి. బ్రాహ్మలు యెలాగయినా మీచేత పది డబ్బులు ఖర్చుపెట్టించి దిట్టంగా భోజనాలుచేసి దక్షిణలుపుచ్చుకొని యెలాగయినా తమరుబాగుపడడానికి చూస్తారు. నామాటవినిమీరు జపాలూ తపాలూమానివేసి దొరఅనుగ్రహం సంపాదించడానికి చూడండి.మీరులంచాలుపుచ్చుకుని బ్రాహ్మలకు సంతర్పణలూసమారాధనలూ చేస్తారని వినడంచేత మీమీదవున్న కోపంచేత దొర యిలాగున చేసినాడేకాని లేకపోతే యిలాగు చేసేవాడుకాడు. ఇక్కడ దొరకు అనుగ్రహం రాకపోతే యీబ్రాహ్మలకు పెట్టే సొమ్ముపెట్టి చెన్నపట్నంవెళ్ళి అప్పీలుచేసుకుంటే తప్పకుండా కార్యమవుతుంది! మీరు హారాలూ వజ్రాలూ యీచాదస్తమంతా మాని నేను చెప్పినప్రకారం విదియనాడేబయలుదేరి వున్నట్టయితే యీ చిక్కులన్నీ లేకుండా మహారాజువలె మీపనిలో మీరుతిన్నగావుండి వుందురు.

పాప—యేమో యిఖ జరిగిపోయినదానికి విచారిస్తే కార్యంలేదు. ముందుసంగతి చూచుకోవలెను. మనంజ్యోతిషంబొత్తిగా కొట్టివెయ్యరాదు, మనసొమ్ముకొంత బ్రాహ్మల హృదయంలో పడితేనేకాని మనం యేఅప్పీలుచేసినా కార్యంవుండదు. నవగ్రహజపాలు వక్క యీపనికోసమేకాకుండా అనేకవిధాల మంచివి.

యీవాళ మొదలుకొని ముందుగా సూర్యనమస్కారాలు చేయింతాము.

కామ—పాపయ్యపంతులువారు కేవలమూ బ్రహ్మాణ్యులు వారికి తెలియని దేమీలేదు. బ్రాహ్మలకు ఎంతయిస్తే భగవంతుడు అంత సంతోషిస్తాడు. భగవంతుడు సంతోషిస్తే సమస్తకార్యాలకూ విజయం కలుగుతుంది. అబ్బాయీ! నీకింకామంచీచెడ్డా తెలియవు వూరుకో.

సుబ్బా—మీకన్నీ తెలుసును. ఇదివరకు బ్రాహ్మణులకు పెడుతూవచ్చినఫలం నేటికిట్లా కనబడ్డది. నేనుచెపితేవింటారు గనుకనా? మీమనసువచ్చినట్లు చెయ్యండి. (అని వెళుచున్నాడు.)

దురాచారదూషణము.

(విశ్వేశ్వరరావుగారును, గరళకంఠ శాస్త్రిలవారును ప్రవేశించుచున్నారు.)

వి—శాస్త్రుల్లగారూ! వూళ్లో విశేషాలు యేమిటి?

గర—విశేషాలకేమివున్నవండి? అంతాకలికాలం వచ్చినది. ఈయింగ్లీషుచదువుకున్న వారిమూలంగా అంతా వర్ణసంకరమవుతూ వున్నది. బాగా ఆలోచిస్తే యిదంతా వాళ్ళవాళ్ళ బుద్ధిజాడ్యంలో వున్నదిగానండి యింగ్లీషుచదువులోనూ యేమీలేదండి. ఇంగ్లీషులో తమకంటె యెక్కువపాండిత్యంగలవారూ యెక్కువపరీక్షయిచ్చినవారూ యెవ్వరువున్నారు? తమబ్రాహ్మణపక్షపాతమూ మతాభిమానమూ చూస్తే నాకుయెంతో ముచ్చటవుతుంది. యిది తమముందర ముఖస్తుతికోసం అనేమాటకాదుసుమండీ? నేను యిది నిజంగా త్రికరణశుద్ధిగా చెప్పేమాట.

వి—అవునండి. ఇప్పుడన్నీ పాడుదినాలువచ్చినవి. పూర్వపు రాజుల కాలమయితే మనమెంతైనా చేతుము. మనం లోపలయేమి చేసినా యీవర్ణసంకరం చేసేవాళ్ళను బహిరంగంగా యేమీ చెయ్యడానికి వల్లపడదు. అందుచేతనే లోపలనాకు వాళ్ళమీద గొంతుకదాకా కోపంవున్నా పయికి యేమీ యెరుగని వాడివలెనటిస్తాను.

గర—మీరుఅవశ్యం వాళ్ళకలాగు కనపడవలసినదే. ఆలా వుంటేనేకాని వాళ్ళమర్మాలూ రహస్యాలూ ఆలోచనలూ తెలుసుకొని వాళ్ళను సాధించడానికి వల్లపడదు. సమస్తతంత్రములూ తమకంటె యెవరికీయెక్కువ తెలియవు. మిత్రభేదంవుంటేనేకాని కార్యం కానేరదు. రాజనీతిలో విష్ణుశర్మ మిత్రభేదమును యెంతబలముగా చెప్పినాఁడు? పంచతంత్రంలో కరటక దమనకులు వృషభందగ్గర మంచిమాటలుచెప్పి మిత్రభేదంచేసి దాన్నియెలాగు చంపినారు? చిరంజీవి అనే కాకి గుడ్లగూబలతో స్నేహంచేసి వాటినన్నిటినీ యేలాగు నాశనంచేసినది? ఇలాగంటి కథలు పుస్తకాలలోవింటూ వుండడమేకాని అటువంటిశక్తిమీవద్దతప్ప మరియెక్కడా చూడలేదు. వాటివలెనే మీరు మీకార్యం సాధించి చివరకు జయభేరి వేస్తారు.

వి—దైవానుగ్రహమువల్ల మనకృషి నెరవేరవలెనుకాదండి. మన ఆచార్లవాళ్ళకయినా బుద్ధిలేదు. మనదగ్గిరకు వచ్చినప్పుడు తలకాయ ఆడించిపోయినా అవతలకు వెళ్ళినతరువాత వారు మనం చెప్పినట్లల్లా చెయ్యరు. పాడు ముండాకొడుకులు దొరికేడబ్బుపోతుందేమోఅని జడుస్తారు. మెట్టుమీదమాట మనలో యెవళ్ళకూ కట్టు లేదండి. నిజంగా వీళ్ళల్లోకట్టయినా వున్నట్టయితే నేనుచేసే కృషికి యెంతపనిఅయినా జరుగును.

గర— అవునండి మనవాళ్ళల్లోనే కట్టువుంటే వాళ్ళాడినట్లల్లా సాగుతుందండీ? ఇంకా మీమతంలో కొంచెం కట్టువున్నదండి. చూచినారా మొన్న మనవాళ్ళు యెంత విరుద్ధమైన కార్యం జరిగించినారో! అతి బాల్యవివాహాలుకూడదని శాస్త్రానికీన్నీ శిష్టాచారానికీన్నీ కేవలం విరుద్ధంగా వాదంచేస్తూవున్నందుకు పురుషోత్తమరావుగారి యింటికి యెవరూ వెళ్లకూడదని కట్టుచేసుకున్నామా అండీ? అటువంటి స్థితిలో మానశిరస్తాదారుగారూ మొదలయినవారంతా అతణ్ని వెంటవేసుకుని వెళ్ళి చెరుకుతోటలో కలిసి చెరుకుపానకం పుచ్చుకున్నారట. యిటువంటి అకార్యకరణం జరిగినతరువాత వాళ్ళను వెలివెయ్యకుండావుంటే యింకామతం యేమిటండీ. మీరు యిందులో గట్టి శ్రద్ధ చెయ్యవలెను.

వి—మీస్మార్తులలో మీరున్ను జంబుకశాస్త్రుల్లగారున్ను కలిసి పనిచెయ్యండి. ఆచెరుకుపానకం తాగినవాళ్ళలో మామతం వాడుకూడా వకడువున్నాడట. అతగాడి విషయంలో నేను తగినంత పనిచేస్తాను. మీరుయింటికి వెళ్ళేటప్పుడు మరచిపోకుండా లోకాచార్లు గారిని మాయింటికిపంపించి మరీవెళ్ళండి. అతగాడు వకమాటు నన్ను యెంతమాట అన్నాడనుకొన్నారు? ఆమాటవిన్నప్పటినుంచీ అతనిమీద నాకుకోపం వేధిస్తూవున్నది. మొన్న మేము యిద్దరమూ వకచోట కలుసుకున్నప్పుడు "పంతులుగారు యెక్కడా దర్శనంలే" దన్నాడు. దర్శనంకోసం నేను తనయింటిచుట్టూ తిరుగుతూవుంటాననుకొన్నాడా?

గర—ఆయనకు చిన్నతనంకూడానండి అదృష్టవశంచేత నెలకు నాలుగువందలు సంపాదిస్తూ వున్నాడన్నమాటేకానండి లోకానుభవం యెంతమాత్రమూ లేదు. అనవచ్చినమాటా అనరానిమాటా తెలియదు. తమగౌరవం చూడకుండా తమరిని అటువంటిమాట అనడం కేవలం తప్పితం.

వి—నన్ను అతగాడు మర్యాదయెరుగకుండా చిన్నతనపు మాటలు అనడం యీావక్కమాటే కాదండి. చాలామాట్లు ఆలాగే చేసినాడు. యీామధ్య యెవరితోటో నేనుభోగందానితో వెళ్ళి రోగాలు తగిలించుకొన్నానని ప్రశంస చేసినాడట! నేనుమగవాణ్ని గనుక మహారాజువలె నాడబ్బు నేను ఖర్చుచేసుకుని మనసు వచ్చిన వాళ్ళతో తిరుగుతాను. తనకుమల్లె అతిబాల్యవివాహాలు కూడ వనే వాళ్ళతోనూ వేదశాస్త్రిలు పౌరుషేయములనే వారితోనూ స్నేహంచేసి కులహానివచ్చే కార్యంయేమీా చెయ్యలేదుగదా? ఇప్పటివాళ్ళకు నవుకర్లను తిన్నగా వుంచుకుని వాళ్ళచేత పని పుచ్చుకోవడం తెలియదు. నేను వక్క నౌకరునువుంచుకుంటే ముందుగానే రెండు పనులకు అక్కరకువచ్చేటట్టు ఆలోచిస్తాను.

గర—అవునండి తమకూ వారికీ సాపత్యం యెక్కడండి? ఇప్పుడు మనం చెయ్యవలసిన కార్యం ముందుగా ఆలోచించవలెను. బుద్ధియందు తమరు బృహస్పతిని మించినవారు. తమకూ కచేరీకి వేళవుతూవున్నది. వేగిరం సెలవియ్యండి. తమబుద్ధికి అసాధ్యం యేమీాలేదు.

వి—మీారు స్మార్తుల నలుగురియిళ్ళకూ వెళ్ళి మొన్న తోటలోకి వెళ్ళినవాళ్ళ యిళ్ళకు యెవళ్ళూ తాంబూలానికీ భోజనానికీ వెళ్ళకుండానున్ను పిలవకుండానున్ను బందోబస్తు చెయ్యండి. తన శిరస్తాదారీ యిక్కడయేమైనా పనికివస్తుందేమో చూతాము.

గర—ఆయన శిరస్తాదారీ డాబూదర్పమూ యేమీాలేదు. మూలనున్న ముసలిముండ లేవదు. డబ్బుపుచ్చుకోవడం చేతగాక మేమేమోాలంచాలు పుచ్చుకోమనీ బహునిష్ఠాపరులమనీ సిగ్గులేకుండా చెప్పుకుంటారు. అప్రయోజకులంతా మడికట్టుకునే కూర్చుంటారు. ఈయనవచ్చి శిరస్తాదారీనవుఖరే చంపివేసినాడు. వుద్యోగం వున్న